


సోమశిలలో 69.707 టీఎంసీల నీరు



అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శనివారం 1,922 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 69.707 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,550, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



జీవీ పాళెం ఓడరేవు వద్ద పడవ షికారుకు వెళుతున్న సందర్శకులు

పర్యాటక హబ్‌గా పులికాట్



తడ, దొరవారిసత్రంలలో ఉన్న పర్యాటకశాఖ రిసార్ట్‌లను అందుబాటులోకి తెస్తాం. కొల్లేరుతో పాటు పులికాట్ సరస్సును పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతాం. పర్యావరణ పరిరక్షణతో పాటు మత్స్యకారుల సంక్షేమమూ మాకు ముఖ్యం. డిప్యూటీ సీఎం, అటవీ శాఖా మంత్రి అయిన పవన్ కల్యాణ్ దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లి ఆంక్షల సడలింపునకు కృషి చేస్తాం.

-పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్

రిసార్ట్‌లు ప్రైవేటుకు వద్దు



పులికాట్ సరస్సు పూడికతీతకు అనుమతులు వచ్చాయి. త్వరలోనే ఆ పనులు మొదలవుతాయి. ఇక్కడి రిసార్ట్‌లను పూర్తిగా ప్రైవేట్ పరం చేయకుండా ప్రభుత్వ భాగస్వామ్యంతో నడిచేలా మంత్రి చర్యలు తీసుకోవాలి.

- సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

యువతకు ఉపాధి



సూళ్లూరుపేట, నేలపట్టు, బీవీపాలెం ప్రాంతాలను టూరిజం హబ్‌గా చేస్తే యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయి. ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. ఇది మత్స్యకారులకూ ప్రయోజనకరం అవుతుంది. ప్రకృతి సౌందర్యంగా పర్యాటకులను ఆకర్షిస్తున్న పులికాట్ సరస్సు అభివృద్ధికి అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకొంటుంది.


- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్



సూళ్లూరుపేట జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఫ్లెమింగో ఫెస్టివల్ బెలూన్ ఎగురవేస్తున్న మంత్రి కందుల దుర్గేష్ ఎమ్మెల్యే విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు



ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభం సందర్భంగా సూళ్లూరుపేటలో శోభాయాత్ర



రెక్కలు విప్పుకున్న ఉత్సవం

ఘనంగా మొదలైన ఫ్లెమింగో ఫెస్టివల్

సూళ్లూరుపేట/ తడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగ శనివారం ఘనంగా మొదలైంది. మూడు రోజుల పాటు జరిగే ఫ్లెమింగో ఫెస్టివల్‌ను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానంలో ఫ్లెమింగో బెలూన్ ఎగురవేసి ప్రారంభించారు. ఉదయం సూళ్లూరుపేట హోలీక్రాస్ సర్కిల్ నుంచి ప్రభుత్వ కళాశాల మైదానం వరకు శోభాయాత్ర జరిగింది.బుట్టబొమ్మలు, మంగళ వాయిద్యాలు, కేరళ బ్యాండ్‌మేళం, కోలాట నృత్యాలతో ఈ శోభాయాత్ర కన్నులపండువగా సాగింది. పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్, డీఎఫ్‌వో హారిక శోభాయాత్రలో ముందు నడిచారు. అనంతరం మైదానంలో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్‌ను మంత్రి ప్రారంభించి, అక్కడ ఏర్పాటు చేసిన నమూనాలను తిలకించారు. క్రీడా ప్రాంగణంలో మంత్రి క్రీడాకారులతో కాసేపు ఆడి అలరించారు. శ్రీసిటీ, షార్ స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకున్నాయి. చిన్న బొమ్మ విమానాలను మైదానంలో ఎగురవేశారు.ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభ సమావేశంలో మంత్రి కందుల దుర్గేశ్ ప్రసంగించారు. టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్తలు కొండేపాటి గంగాప్రసాద్,తానంకి నానాజీ, సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, ఆర్డీవో కిరణ్మయి, జనసేన నాయకుడు ఉయ్యాల ప్రవీణ్, బీజేపీ నాయకుడు ఆదినారాయణరెడ్డి తదితరులు శోభాయాత్రలోనూ, ఇతరకార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు.

పులికాట్‌లో..

పులికాట్ సరస్సులోని పక్షులను వీక్షించడానికి సందర్శకులు శ్రీహరికోట రోడ్డులో బారులు తీరారు. అటకానితిప్పలోని విజ్ఞానకేంద్రానికి, పులికాట్ సరస్సు వ్యూపాయింట్‌ల వద్దకు పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. జర్మనీ దేశస్థులు కొందరు ఫ్లెమింగో ఫెస్టివల్‌కు రావడం విశేషం.

నేలపట్టులో..

నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో తొలిరోజు పర్యాటకుల సందడి ఎక్కువగా కన్పించింది. బైనాక్యులర్స్ ద్వారా పక్షులను వీక్షిస్తూ జనం సందడి చేశారు. ఇక్కడి స్నేక్ షో అందరిని ఆకట్టుకుంది.

ఉత్సాహంగా పడవ షికారు..

భీములవారిపాళెం పడవలరేవులో పర్యాటకుల సందడి పెద్దఎత్తున కనిపించింది. పర్యాటకులు పడవల్లో షికారు చేస్తూ సందడి చేశారు.

ఐదేళ్ల తర్వాత.. పండుగ ఇలాగేనా?

ఈ సారి పక్షుల పండుగకు తగినంత ప్రచారం కొరవడటంతో ప్రారంభోత్సవంలో సందర్శకులు పలుచగా కనిపించారు. దీనికి తోడు పాఠశాలలకు సెలవులు కావడంతో విద్యార్థులు కూడా పెద్దగా రాలేదు. తిరుపతి, నెల్లూరు జిల్లాల్లోని ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవడంలోనూ లోపం కనిపించింది. స్థానిక నాయకులు కూడా పెద్దగా హాజరు కాలేదు. ఐదేళ్ల తర్వాత తిరిగి మొదలవుతున్న ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభోత్సవం ఆశించినంత ఘనంగా అయితే కనిపించలేదు. కేవలం ఒక మంత్రి, ఒక ఎమ్మెల్యేతోనే పక్షుల పండుగ మొదలు కావడం విశేషం. జిల్లాలోని ఇతర ప్రజాప్రతినిధులు ఎవరూ ప్రారంభ కార్యక్రమానికి హాజరు కాలేదు. ప్రతిష్టాత్మకమైన ఒక రాష్ట్ర పండుగ జరుగవలసినంత సంబరంగా అయితే తొలిరోజు కార్యక్రమాలు మొదలు కాలేదు.



శనివారం రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమం



షార్ వారిచే ఏర్పాటు చేసిన స్టాల్

టీడీపీలో కొనసాగడం

గర్వకారణం : వేమిరెడ్డి

● ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నేతల రక్తదానం

నెల్లూరు (వైద్యం) జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దివంగత సీఎం ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీలో కొనసాగడం గర్వకారణంగా ఉందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పలువురు నేతలు పూలమాల వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎన్టీఆర్ అనే మూడు అక్షరాలు తెలుగుజాతికి గర్వకారణమన్నారు. తాతకు మించి ప్రజలకు చేయాలన్న ఉద్దేశంలో నారా లోకేష్ ముందుకు వెళుతున్నారని తెలిపారు. వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా తెలుగువారికి గుర్తింపు వచ్చిందంటే అది ఎన్టీఆర్ వల్లేనని పేర్కొన్నారు. ఏపీలో టీడీపీకి కోటికిపైగా సభ్యత్వాలు నమోదు అయ్యాయంటే పార్టీకే గర్వకారణమన్నారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ నాడు ఎన్టీఆర్ ప్రవేశ పెట్టిన పథకాలనే నేడు అన్నీ పార్టీలు కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు. ఎన్టీఆర్ వారసుడిగా చంద్రబాబు రాష్ట్రాన్ని గాడిలో పెట్టారని అన్నారు. అనంతరం టీడీపీ నేతలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మామిడాల మధు, నేతలు మొయినుద్దీన్, రమణారెడ్డి, కొండూరు పోలిశెట్టి, భూలక్ష్మి, రేవతి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, బ్రహ్మం గుప్తా తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్‌కి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీ వేమిరెడ్డి, అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి తదితరులు

● **నర్తకి సెంటర్‌లో...**

నగరంలోని నర్తకి సెంటర్‌లో కూడా ఎన్టీఆర్ వర్ధంతి ఘనంగా జరి గింది. మాజీ మంత్రి తాళ్లపాక రమేష్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తోపాటు నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొని ఎన్టీఆర్‌కు ఘననివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, పలువురు కార్పొరేటర్లు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎన్టీఆర్ చిత్రాలు

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఎనిమిదిమంది చిత్రకారులు నగరంలోని టౌన్‌హాలు ప్రాంగణంలోని వర్ధమాన సమాజంలో శనివారం ఎన్టీఆర్ చిత్రకళా ప్రదర్శన, విక్రయాలను ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో తాము గీసిన చిత్రాలను ప్రదర్శించడమేకాక చిత్రాల పట్ల ఆసక్తి కలవారు కొనుగోలు చేసేలా వాటి వద్దే ధరల పట్టికను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు తాళ్లపాక రమేష్‌రెడ్డి పాల్గొని చిత్రమాలికను తిలకించి, చిత్రకారులను అభినందించారు. ఎగ్జిబిషన్‌ను 25 కళా సంఘాల గౌరవాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో అతిథులుగా పెద్దచెరుకూరుకు చెందిన టీడీపీ నాయకుడు పవన్‌రెడ్డి, ఎస్వీ హైస్కూల్ కరస్పాండెంట్ అందె శ్రీనివాసులు, విశ్రాంత ఎంఈవో నరసయ్య పాల్గొ న్నారు. చిత్రకారులు డాక్టర్ అమీర్ జాన్, సుందరబాబు, నెల్లూరు అన్నపూర్ణ, సునీత, దువ్వూరు శేషయ్య, బాలకృష్ణ, శ్రీనాథ్, లక్ష్మి గీసిన సుమారు 30 ఎన్టీఆర్ చిత్రాలను ప్రదర్శనకు ఉంచారు.



ప్రదర్శనకు ఉంచిన ఎన్టీఆర్ చిత్రాలు

పరిసరాల పరిశుభ్రత

మనందరి బాధ్యత

● కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(సిటీ),జనవరి 18,(ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యతని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ అన్నారు. స్వచ్ఛాంధ్ర సాధనలో భాగంగా శనివారం నెల్లూరు నగరంలోని వీఆర్సీ కూడలి నుంచి మద్రాసు బస్టాండ్ మీదుగా గాంధీ బొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీజీకి ఘన నివాళి అర్పించారు. తదుపరి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎన్‌ఎంసీ కమిషనర్ సూర్యతేజలతో కలిసి కలెక్టర్ ప్రతిజ్ఞ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనతోపాటు మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే, దేశం స్వచ్ఛంగా ఉంటుందన్నారు. పరిశుభ్రతపై ప్రజలంతా ఐక్యంగా నడవాలని తెలిపారు. శుభ్రత అనేది ఒక్కరోజులో అయ్యేదికాదని, ప్రతినెల మూడో శనివారాన్ని ఇందుకోసం కేటాయించాలని పేర్కొన్నారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించడంలో మీడియా క్రియాశీలక పాత్రపోషించాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాలనుసారం జిల్లాలోని 722 గ్రామ పంచాయతీలతోపాటు మున్సిపాలిటీల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఏకకాలంలో నిర్వహించినట్లు తెలిపారు. మార్చి 31నాటికి అన్నీ గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహితంగా మార్చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, వివిధ శాఖల అధికారులు, నగరంలోని సచివాలయ సిబ్బంది, వివిధ వాకర్స్ అసోసియేషన్ల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆనంద్



నెల్లూరు నగరంలో నిర్వహించిన ర్యాలీ

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత : జడ్పీ చైర్‌పర్సన్

నెల్లూరు (జడ్పీ, ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలతోపాటు, గృహాలు, ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని ఆమె శనివారం జడ్పీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన భూమిని, మనం నాశనం చేసుకుంటే అనారోగ్యాలు కొనితెచ్చుకోవడమే అవుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడడంతోపాటు, పరిశుభ్రతను పాటించాలన్నారు. మొక్కలు నాటడాన్ని పెద్దఎత్తున చేపట్టాలన్నారు. అడవులను నాశనం చేయకుండా చెట్లను కాపాడాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో విద్యారమ, కార్యాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



జడ్పీ కార్యాలయ ఆవరణంలో మొక్క నాటుతున్న చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో విద్యారమ తదితరులు

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

● జిల్లా వ్యాప్తంగా 2,697 మంది హాజరు

నెల్లూరు(విద్య), జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరోతరగతిలో ప్రవేశానికి జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షను ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించారు. జిల్లాలో 21 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు మొత్తం 5,172 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 2,475 మంది గైర్హాజరు కాగా, 2,697 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు.



ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షను తనిఖీ చేస్తున్న తహసీల్దారు సుభద్ర



హుషారుగా.. పడవ షికారు

పెళ్లకూరు/తడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తడ మండలం భీములవారిపాళెం వద్ద పడవ షికారుకు సందర్శకులు ఉత్సాహం చూపారు. పెద్ద సంఖ్యలో పులికాట్ సరస్సులో విహరించారు. పడవషికారులో లైఫ్ జాకెట్లతోపాటు 10 మందికి మించి వెళ్లనీవ్వకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. పులికాట్ సరస్సు ఒడ్డున కొందరు నీళ్లల్లో ఆడుతూ సందడి చేశారు. అక్కడి వేదిక వద్ద స్థానిక కళాకారులు నృత్య ప్రదర్శన పాటలతో అలరించారు. అక్కడే విధుల్లో ఉన్న పెళ్లకూరు ఎంపీడీవో ప్రమీలారాణి బుల్లెట్ బైక్ పాటకు డ్యాన్స్ వేసి ఉత్సాహపరిచారు.

పక్షులు.. పడవలు.. పర్యాటకులు..

అంబరాన్నంటిన పక్షుల పండుగ

ఏటా విహంగ ప్రేమికుల మనసు దోచుకుంటున్న ఫ్లెమింగో ఫెస్టివల్ సుమారు పాతికేళ్ల క్రితమే శ్రీకారం చుట్టుకొంది. దేశంలో మరెక్కడా లేనివిధంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవానికి బీజం పడిన నాటి విశేషాలను ఒకసారి మననం చేసుకుందాం.

- దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

విహంగ వేడుక.. ఇంతింతై..

2000లో నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్ పనిచేశారు. ఈ సయంలో దొరవారిసత్రం మండలం కలగుంట రైల్వే వంతెన ప్రాంతంలో వేల సంఖ్యలో చక్కర్లు కొడుతున్న పక్షుల సమూహాలు ఆయనను ఆకర్షించాయి. అవి నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం విడిదిలోని విదేశీ విహంగాలని తెలుసుకున్నారు. వీటిపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. నాటి శాసన సభ్యుడు పరసా వెంకటరత్నయ్య, టీడీపీ నేత వేనాటి రామచంద్రారెడ్డిలతో తన ఆలోచనలను పంచుకున్నారు. పక్షులతో విడదీయరాని బంధమున్న ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు వచ్చేలా పండగ నిర్వహించాలని సంకల్పించారు. ఫలితంగా నేలపట్టులో 2000 జనవరిలో పక్షుల పండుగ ప్రారంభమైంది. 2001లో సూళ్లూరుపేట వేదికగా నేలపట్టు, పులికాట్ సరస్సుల్లో ఫ్లెమింగో పేరిట జిల్లా స్థాయిలో పండుగ నిర్వహించారు. 2002లో అదే ఉత్సాహం కొనసాగించారు. వేడుక పుణ్యమాని నేలపట్టు ప్రాంతంలో పలు అభివృద్ధి పనులు శ్రీకారం చుట్టుకున్నాయి. 2003 ఫెస్టివల్ సమయానికి నేలపట్టులో రోడ్లు, టూరిజం భవనాలు, దొరవారిసత్రంలో టూరిజం హోటల్, తడలో టూరిజం హోటల్‌ను నెలకొల్పారు.

2016లో స్టేట్ ఫెస్టివల్‌గా..

2004, 2009లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఫ్లెమింగో ఫెస్టివల్‌ను కొనసాగించింది. 2009లో టీడీపీ ఎమ్మెల్యేగా మళ్లీ గెలిచిన పరసా వెంకటరత్నయ్య నాటి ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డితో కలిసి చొరవ తీసుకుని పక్షుల పండుగ కొనసాగేలా చూశారు. 2014లో టీడీపీ అధికారంలోకి రావడంతో చంద్రబాబు 2016లో ఈవేడుకను ఏపీ టూరిజం క్యాలెండర్‌లో చేర్చారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. అయితే విశేష జనాదరణ కలిగిన ఫ్లెమింగో ఫెస్టివల్‌ను గత వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. 2019లో అధికారంలోకి వచ్చాక 2020లో మొక్కుబడిగా జరిపింది. తర్వాత నాలుగేళ్లూ నిర్వహించలేదు. టీడీపీ అధికారంలోకి రావడంతో పక్షుల పండుగకు ఇప్పుడు మళ్లీ ప్రాణం వచ్చింది.



ఫ్లెమింగో ఫెస్టివల్ వేదికపై పర్యాటక బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్ ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు

మొదటిసారి పడవ ప్రయాణం



మొదటిసారి పడవ షికారుకు వచ్చా. నీళ్లల్లో పడవ వెళ్తుంటే ఆనందంతో కేరింతలు కొట్టాలనిపించింది.

- విరోనిక, 6వ తరగతి, నాయుడుపేట

అహా.. వలస పక్షుల విన్యాసాలు

పులికాట్ సరస్సులో ఫ్లెమింగోలను చూడాలని వచ్చాం. వీటి విన్యాసాలను చూస్తుంటే అబ్బురపరుస్తున్నాయి. పిల్లలు వాటిని చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు.

- పూజిత, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, బుచ్చినాయుడుకండ్రిగ



నేలపట్టు కిట.. కిట!

దొరవారిసత్రం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగో ఫెస్టివల్ మొదటి రోజైన శనివారం నేలపట్టు పక్షుల కేంద్రానికి సందర్శకులు క్యూకట్టారు.





ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు, చిత్తూరు, తమిళనాడు, ప్రకాశం జిల్లాల నుంచీ భారీగా తరలి వచ్చారు. కుటుంబ సమేతంగా.. చంటి బిడ్డలతో, దివ్యాంగులు, వృద్ధులు సైతం పక్షుల వీక్షణకు విచ్చేశారు. మంచి నీటి చెరువుల్లో విడిదిలో ఉన్న విహంగాలను వీక్షించారు. ఓ వైపు పక్షుల కేంద్రంలో పక్షులు తమ సంతతిని వృద్ధి చేసుకొనే పనిలో ఇప్పటికే పిల్లలను పొదిగాయి. వాటి చప్పుళ్లతో పాటు సందర్శకుల రాకతో నేలపట్టు సందడిగా మారింది. చెరువు కట్టలపై జనం కిక్కిరిశారు. వీరిని అదుపు చేయడం వలంటీర్లకు పెద్ద పనిగా మారింది. ఇక, బైనాక్యులర్లు సరిపడా లేకపోవడంపై సందర్శకులు అసంతృప్తి చెందారు. ఎక్కువ మంది సందర్శకులు తమతో తెచ్చుకొన్న కెమెరాలతో పాటు సెల్‌ఫోన్లలో పక్షుల ఫొటోలు తీస్తూ కనిపించారు. తామూ ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు. ఇక, ఈసీ కేంద్రంలో పక్షుల చిత్రాలు, శాండ్ ఆర్ట్, ఫిల్మ్ షో, పెలికాన్ అతిథి గృహాల వద్ద స్థానిక విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. మరోవైపు ఆకతాయిలు, చిల్లర దొంగల ఆటకట్టించేందుకు పోలీసులు పక్షుల కేంద్రంలోని పలు చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ఉరితాడులా వన్యప్రాణి చట్టాలు

ఫ్లెమింగో సభలో మాజీ ఎమ్మెల్సీ వాకాటి

సూళ్లూరుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పులికాట్ సరస్సు పై ఈ ప్రాంతంలో దాదాపు 10 వేల మందికి పైగా మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారని, అంతేకాకుండా పులికాట్ సమీపంలో ఇరకం, వేనాడు దీవులు, కొరిడి-పేర్నాడు తీర ప్రాంత గ్రామాలు ఉన్నాయని గ్రామాల్లో అభివృద్ధి చేయాలన్న, రోడ్లు నిర్మాణాలు చేపట్టాలన్న వన్యప్రాణి చట్టాలు ఉరితాడులా మారాయని మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న షార్ కేంద్రానికి మాత్రం చట్టాలు వర్తించవా? సరస్సు పై ఆధారపడి జీవనం సాగించే వారికి మాత్రం చట్టాలు వర్తిస్తాయా? ప్రభుత్వం దీని పై చొరవ తీసుకొని ఈ ప్రాంతాల అభివృద్ధికి అడ్డంకులు తొలిగేలా కొన్ని సడలింపులు తీసుకోవాలన్నారు. మాజీ మంత్రి పరసా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో పక్షుల పండుగ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గత ప్రభుత్వం పక్షుల పండుగ నిలిపివేసింది

● వైసీపీ నేత సంచలన వ్యాఖ్య

సూళ్లూరుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):గత ప్రభుత్వం 2020 తరువాత పక్షుల పండుగ నిలిపివేసిందని వైసీపీకి చెందిన సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభోత్సవ సభలో చేసిన వ్యాఖ్యలు అందరినీ ఆశ్చర్యపరిచాయి. ప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా ఆర్‌అండ్‌బీ రోడ్లు దారుణంగా దెబ్బతిని గుంతలమయమైపోయాయని అన్నారు.ప్రస్తుత ప్రభుత్వం ఆ రోడ్లకు మరమ్మతులు చేస్తోందన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు సన్నిహిత కుటుంబంగా పేరున్న దబ్బల రాజారెడ్డి కుమారుడు వారి గత ప్రభుత్వంలోని లోపాలను ఎత్తిచూపుతూ మాట్లాడడంపై పలువురు చర్చించుకున్నారు.

కోస్టల్ కారిడార్‌లో పర్యాటక అభివృద్ధి చేస్తాం

● నేలపట్టులో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

దొరవారిసత్రం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 970 కి.మీ మేర ఉన్న కోస్టల్ కారిడార్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. విదేశీ విహంగాలు విడిది చేసే నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని శనివారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈసీ కేంద్రంలోని పక్షుల జీవన చిత్రాలను తిలకించారు. చెరువు కట్టపై నుంచి బైనాక్యులర్ ద్వారా పక్షులను వీక్షించారు. నేలపట్టు ప్రకృతి సిద్ధమైన, అరుదైన కేంద్రమని పేర్కొన్నారు. నేలపట్టు ప్రాముఖ్యత, విడిది చేసే పక్షుల జీవన శైలి గురించి డీఎఫ్‌వో హారిక వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. నేలపట్టును టూరిజంపరంగా మరింత అభివృద్ధి చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడంతోనే ఇంతటి జనాదరణ ఉన్న ఫ్లెమింగో ఫెస్టివల్‌ను నిర్వహించలేదని విమర్శించారు. కూటమి అధికారంలోకి రాగానే పక్షుల పండుగ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంత్రి వెంట గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఎఫ్‌ఆర్‌వో సౌజన్య, తహసీల్దారు శైలాకుమారి తదితరులున్నారు.



నేలపట్టులో బైనాక్యులర్ ద్వారా పక్షులను వీక్షిస్తున్న రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

పర్యావరణం.. పరిశ్రమలపై శ్రీసిటీలో సదస్సులు

శ్రీసిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగో ఫెస్టివల్‌లో భాగంగా శనివారం 'పర్యావరణం.. పరిశ్రమలు'పై శ్రీసిటీలో సదస్సు నిర్వహించారు. శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో జరిగిన కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్‌ఆర్) సదస్సులో పర్యావరణ నిర్వహణ, సామాజిక స్పృహ అంశాలను చర్చించారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌లో శ్రీసిటీ పాల్గొనడం సుస్థిరత, పర్యావరణ పరిరక్షణ పట్ల దాని నిబద్ధతకు నిదర్శనమని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. జీవ వైవిధ్యాన్ని రక్షించడానికి, ప్రకృతి సమతుల్యతను పెంపొందించడానికి పరిశ్రమలు, స్థానికుల సహకారం అవసరమన్నారు. పర్యావరణ పరిరక్షణతో వ్యాపార లక్ష్యాలను సమతుల్యం చేయడానికి సీఎస్‌ఆర్ కార్యక్రమాలు చేపట్టాలని అటవీశాఖ కన్జర్వేటర్ సి.సెల్వం కోరారు. పులికాట్ సరస్సు, వలస పక్షుల నివాసాల రక్షణకు కార్పొరేట్ భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తూ బీఎన్‌హెచ్‌ఎస్ డైరెక్టర్ కిషోర్ రితే ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. ఇక్కడ హరిత పరిశ్రమలను మాత్రమే ఏర్పాటు చేస్తున్నామని శ్రీసిటీ చైర్మన్ సి.శ్రీనిరాజు తెలిపారు. అభివృద్ధితో పాటు ప్రకృతి పరిరక్షణపైనా ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. పులికాట్ సరస్సును కాపాడుకోవడానికి సమష్టి, నిరంతర కృషి అవసరమని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు. దీనికి ఫ్లెమింగో ఫెస్టివల్ ఎంతో ఉపకరిస్తుందన్నారు. శ్రీసిటీ పరిశ్రమల సీఎస్‌ఆర్ ప్రయత్నాలను అభినందిస్తూ ఐఎంవోపీ, కెల్లాగ్స్, పార్సన్ ప్యాకేజింగ్స్,ఇసుజు మోటార్స్, టీహెచ్‌కే, కోల్గేట్ పామోలివ్,డైకి అల్యూమినియం, బెర్గెన్‌పైప్స్, డానియేలీ, హామిల్టన్, ఆస్ట్రోటెక్, పియోలెక్స్, ఎస్ఎంసీసీ, వెస్ట్ ఫార్మా పరిశ్రమల అధికారులకు కలెక్టర్ జ్ఞాపికలను అందజేశారు. క్రియా విశ్వ విద్యాలయంలో జీవ వైవిధ్యం, చిత్తడి నేలల సంరక్షణపై రెండు రోజుల సమావేశం కూడా బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ(బీఎన్‌హెచ్‌ఎస్)కి చెందిన డాక్టర్ సత్యసెల్వం అధ్యక్షతన శనివారం ప్రారంభమైంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్‌ఈఆర్), పక్షి శాస్త్ర నిపుణుల భాగస్వామ్యంతో జరిగిన ఈ సమావేశంలో వృక్ష, జంతు వైవిధ్యం, మత్స్య, పర్యాటక ప్రయోజనాలు, హైడ్రోలాజికల్ డైనమిక్స్, వాతావరణ మార్పు ప్రభావాలు, కాలుష్యం తగ్గించడం తదితర ప్రయత్నాల్లో సమాజ భాగస్వామ్యంపై చర్చించారు.



సీఎస్ఆర్ బహుమతి అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

నేటి కార్యక్రమాలిలా..

తడ, ఆంధ్రజ్యోతి: ఆదివారం జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో సినీ సంగీత దర్శకుడు రఘు కుంచె, గాయని మంగ్లి పాల్గొననుండగా, బిగ్‌బాస్ ఫేమ్ అషురెడ్డి, రవి యాంకర్లుగా వ్యవహరించనున్నారు.

సూపర్ లగ్జరీ బస్సులో అగ్ని ప్రమాదం

ఉలవపాడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అది తిరుపతి నుంచి ఎన్టీఆర్ జిల్లా తిరువూరు వెలు తున్న ఆర్టీసీ సూపర్ లగ్జరీ హైర్ బస్సు. 19 మంది ప్రయాణికులతో శుక్రవారం రాత్రి తిరు పతిలో బయలుదేరింది. మార్గమధ్యలో ఉలవపాడు జాతీయ రహదారి మన్నుటి కోట అడ్డరోడ్డు వద్ద టీ షాపు వద్ద డ్రైవర్ రాము బస్సుని నిలిపి టీ కోసమని వెళ్లాడు. అప్పుడే నిద్రమత్తులో నుంచి బయటకు వచ్చిన ఒక మహిళ బస్సు వెనుకకు వచ్చింది. బస్సు వెనుక భాగంలో పొగలు రావడం గమనించి పెద్దగా కేకలు వేస్తూ ప్రయాణికులను హెచ్చరించింది. బస్సు డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు అలర్ట్ అయ్యేలోపు చూస్తుండగానే కళ్ల ముందు మంటలు బస్సును కమ్మేశాయి. బస్సుల్లో నలుగురు వృద్ధులు కూడా ఉన్నారు. బస్సులో అందిన వరకు వారి వస్తువులను తీసుకొని కిందకు దిగేశారు. బస్సు వెనుక, ప్రక్కన ఉన్న డిక్కీల్లోని వస్తువులను తీసుకునే అవకాశం లేకుండా మంటలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ అంకమ్మ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది అక్కడకు వచ్చి మంటలను ఆర్పారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. బస్సులోని ప్రయాణికులను మరో బస్సులో గమ్య స్థానాలకు చేర్చినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. శనివారం ఉదయం విజయవాడ, నెల్లూరు, కావలి ఆర్టీసీ అధికారులు సంఘటనా స్థలంకు చేరుకొని బస్సులోని ప్రతి భాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. పూర్తిగా వైర్లు కాలిపోయినందున షార్ట్ షర్క్యూట్‌తో ఇలా జరిగిందని ఆర్టీసీ ఎలక్ట్రికల్ మానిటరింగ్ ఉన్నతాధికారి నాగరాజు తెలిపారు. ఈ సంఘటనపై బస్సు యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. టీ కోసమని డ్రైవర్ బస్సుని ఆపకుంటే మార్గమధ్యలోనే తమ ప్రాణాలు మంటలకు ఆహుతైపోయే వారమని ప్రయాణికులు హఠాత్తులైయ్యారు. మొత్తానికి 19 మంది ప్రయాణికులు అదృష్టవంతులని సంఘటనను చూసిన ప్రతిఒక్కరూ మాట్లాడుకోవడం విశేషం.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పెదపవనిలో రెండోరోజూ కొనసాగిన ఉద్రిక్తత

- నిరసన దీక్ష చేసిన జడ్పీటీసీ నళినీ పద్మ
- సబ్ కలెక్టర్ హామీతో దీక్ష విరమణ

లింగసముద్రం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పెదపవనిలోని వివాదాస్పద స్థలంలో రెండో రోజూ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. శుక్రవారం రాత్రే కంచె వేయడంతో జడ్పీటీసీ నళినీ పద్మ తన అనుచరులతో శనివారం కూడా ఆ స్థలం వద్ద నిరసన దీక్ష చేపట్ట డంతో పోలీసులు భారీగా మోహరించారు. అయితే తన స్థలం విషయమై హైకోర్టు పరిధిలో ఉన్నా ఆ స్థలంలో కంచె వేయ డంతో ఆమె ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన దీక్ష చేశారు. అయితే ఈ సందర్భంగా పోలీసు, రెవిన్యూ అధికారులు ఇక్కడ దీక్ష చేయకూడదని, విరమించాలని చెప్పారు.అయితే కోర్టు పరిధిలో ఉన్న స్థలంలో అధికారులందరి సమక్షంలో కంచె ఎలా వేశారని ఆమె ప్రశ్నించడంతో అధికారులు మౌనం వహించారు.దీంతో సాయంత్రం కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ నళినీపద్మతో మాట్లాడుతూ, ఆ స్థలంలోకి ఎవరూ ప్రవేశించకుండా 164వ సెక్షన్ విధించా మని, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో నళినీపద్మ నిరసన దీక్షను విరమించారు. వివాదాస్పద స్థలం కోర్టు పరిధిలో ఉన్న కారణంగా ఆ ఎవరైనా నిబంధనలను అతిక్రమించి ప్రవేశించి నట్లైతే, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసి ల్దార్ హెచ్చరించారు. దీంతో పోలీ సులు ఆ స్థలం వద్ద కాపలా ఉన్నారు. దీంతో రెండు రోజుల నుండి జరుగు తున్న వివాదం సద్దుమణగ డంతో రెవిన్యూ, పోలీసు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



కంచె వేసిన వివాదాస్పద స్థలం

పకడ్బందీగా కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే

సంగం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఈనెల 20వ తేదీ నుంచి జరిగే కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే పకడ్బందీగా నిర్వహించనున్నట్లు జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి ఖాదర్‌వలి తెలిపారు. శనివారం ఆయన స్థానిక ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, ఫార్మసీ విభాగం, డెలివరీ రూము పరిశీలించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందచేశారు. అనంతరం వైద్యశాల ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో స్థానిక వైద్య సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ అశోక్, ఫార్మసిస్ట్ ప్రదీప్, ట్రైనీ డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, తదితరులు

పీఎం ఇంటర్న్‌షిప్ గోడపత్రిక ఆవిష్కరణ

నెల్లూరు (హరనాథపురం) జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ గోడపత్రికను శనివారం జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమ వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం, స్కిల్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఎం. శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఇది పార్కా.. ఆనవాళ్లేవి..?

పొదలకూరులోని ఏర్పాటు చేసిన పార్కు ఒకప్పుడు ఆహ్లాదానికి మారుపేరు. నేడు సౌకర్యాల లేమితో పాటు అధికారుల నిర్లక్ష్యంతో పార్కులో పచ్చదనం కనుమరుగైపోయింది. కనీసం పిల్లలు ఆడుకునే ఆట వస్తువులు, పరికరాలు శిథిలం అయ్యాయి. పూలమొక్కలు స్థానంలో పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ఈ పార్కు మందుబాబులు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు.

- పొదలకూరు, (ఆంధ్రజ్యోతి)



తుస్సుమన్న స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమానికి శనివారం తహసీల్దారు నిర్మలానందబాబా మినహా మండల పరిధిలోని అధికారులందరూ డుమ్మా కొట్టారు. కోవూరు మండల పరిధిలోని అధికారులు ఈ కార్య క్రమం గురించి అస్సలు పట్టించుకోలేదు. శనివారం సెలవు దినంగా భావించి విధులకు సైతం డుమ్మా కొట్టారు. తహసీల్దారు కూడా నామమాత్రంగా కార్యాలయ ఆవరణలో చిత్తుకాగితాలు ఏరివేసి కార్యక్రమంలో పాల్గొన్నట్లు మమ అన్పించుకున్నారు.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)



న్యూస్ బాక్స్

బాలాజీనగర్ ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌ఐ పుల్లారెడ్డి

నెల్లూరు (క్రైం), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ పోలీసు స్టేషన్ ఎస్‌ఐగా ఎం పుల్లారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది పుష్ప గుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఇన్‌స్పెక్టర్ కె సాంబశివరావు, నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుల్లారెడ్డి గతంలో జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో పనిచేశారు.

రైల్వే డీఎస్పీగా మురళీధర్

నెల్లూరు(క్రైం), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రైల్వే డీఎస్పీగా జి.మురళీధర్ నియమితులయ్యారు. 1991 బ్యాచ్‌కు చెందిన మురళీధర్ పార్వతీపురం మన్యం జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తూ శుక్రవారం రాత్రి జరిగిన బదిలీల్లో నెల్లూరు రైల్వే డీఎస్పీగా నియమితులయ్యారు.

విశ్రాంత ఉద్యోగులకు 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలి

నెల్లూరు(హరనాథపురం), జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులకు 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2023 జూలై నెల డీఆర్ 2024 పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలను వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు చెల్లించాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు సంక్రాంతి సందర్భంగా చెల్లించడం హర్షణీయమని, అలాగే విశ్రాంత ఉద్యోగుల సమస్యలను తెలుసుకుని వారికి చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు.

తూనికల, కొలతల అధికారుల దాడులు

ఉదయగిరి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం కావలి తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ కరీముల్లా తన సిబ్బందితో కలిసి పలు దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కిరాణ, మటన్, చికెన్, కూరగాయల తదితర దుకాణాలు తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని దుకాణదారులపై కేసులు నమోదు చేశారు.

ఎస్పీని కలిసిన నుడా చైర్మన్

నెల్లూరు(క్రైం), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్‌ను నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి శనివారం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయడం అభినందనీయమని, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చేలా ప్రజలకు ఫ్రెండ్లీ పోలిసింగ్‌ను చేరవచేయాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మనుబోలు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కాగి తాలపూరు గ్రామానికి చెందిన ఆరుముళ్ల శ్రీనువాసులు (25) చికిత్సపొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇతనికి ఏడాది కిందట వివాహమైంది. కొంతకాలంగా కుటుంబ కలహాలతో మన స్థాపం చెందాడు. అందులో భాగంగా శుక్రవారం పురుగుమందు తాగాడు. ఈ విషయాన్ని గమనించిన బంధువులు అతన్ని చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, 3నెలల పాప ఉన్నది.

అనుమతుల్లేవ్!

- కావలిలో పుట్టుకొచ్చిన అక్రమ లేఅవుట్లు
- హద్దురాళ్లు, కాలువలు, రోడ్ల తొలగింపునకు చర్యలు
- ఈ సమస్యతో రియల్ ఎస్టేట్ పుంజుకునేనా?
- ఆందోళనలో ప్లాట్ల కొనుగోలు దారులు

కావలి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అధికారుల చేతివాటం, రియల్టర్ల ధనదాహమో తెలియదుగాని నిబంధనలను తుంగలో తొక్కి. కావలిలో విచ్చలవిడిగా వెలసిన అక్రమ లేఅవుట్ల సమస్య ప్లాట్ల కొనుగోలుదారులకు తలనొప్పిగా మారింది. వీరికి గత వైసీపీ పాలకులు కూడా సహకరించడంతో ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతుంది. వాటిలో ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తులు మాత్రం నరకం అనుభవిస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఈ లేఅవుట్లపై దృష్టి పెట్టారు. వాటిలో ప్రభుత్వ స్థలాలు ఉన్నాయన్న ఫిర్యాదులతో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి సర్వే చేపట్టారు. దీంతో కావలిలో 128ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమించి ఉన్నట్లు అధికారులు సర్వేలో నిర్ధారించారు. వీటిలో కాలువలు, వాగుల, వంకలు, గుంటలు, శ్మశాన స్థలాలు ఉన్నాయి. ఈ సమస్యతో రియల్ ఎస్టేట్ పూర్తిగా పడకేసి ప్లాట్లు క్రయ విక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి.

జిల్లా అధికారులతో సమీక్ష

ఇటీవల రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఈ లే అవుట్లపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి కొన్ని మార్గదర్శకాలను సూచించి వాటిని క్రమబద్ధీకరించుకోవాలని ఆదేశించారు.



తుమ్మలపెంట రోడ్డులో ఉన్న అక్రమ లేఅవుట్లు

క్రమబద్ధీకరణకు నోచుకోకపోతే అక్రమ లేఅవుట్లు, భవన నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఉండవన్నారు. అక్రమ లేఅవుట్లను గుర్తించి వాటిలో ఎవరూ ప్లాట్లు కొనుగోలు చేయకుండా అవగాహన కల్పిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కావలి పురపాలక సంఘం పరిధిలో 60 నుంచి 70 వరకు అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నారు. శుక్రవారం పట్టణంలోని మద్దూరుపాడు, ముసునూరు టీచర్స్‌కాలనీలలోని అక్రమ లేఅవుట్లలో హద్దురాళ్లు, కాలువలు, రోడ్లను ఎక్సకవేటర్‌లతో తొలగించారు.

రోడ్ల వెడల్పు కుదించినా..

రాష్ట్ర ప్రభుత్వం నుడా అనుమతులకు కొన్ని నిబంధనలు సరళీకృతం చేసింది. గతంలో 40అడుగుల ఉన్న రోడ్లను 30అడుగులకు కుదించింది. అయితే లేఅవుట్లలో ప్లాట్లను రియల్టర్లు అమ్ముకోవటంతో ఇప్పుడు వాటిని ఎవరు క్రమబద్ధీకరించు కోవాలనే సమస్య ఉత్పన్నం అయ్యింది. వాస్తవంగా రియల్టర్లు రైతుల వద్ద పొలం కొనుగోలు చేసి ప్లాట్లు వేసిన తర్వాత విక్రయాలు జరపటంతో అధికారికంగా దొరకటం లేదు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తే తప్ప కావలిలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం పుంజుకునేట్లు లేదు.

బాల భవిత కేంద్రాల్లో చిన్నారులకు మెరుగైన వైద్యం

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత



బాలభవిత కేంద్రంలో చిన్నారులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సుజాత

నెల్లూరు (వైద్యం), జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : బాలభవిత కేంద్రాల ద్వారా అవయవ లోపాలు ఉన్న పిల్లలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వీ.సుజాత వెల్లడించారు. శనివారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిధిలో ఉన్న బాలభవిత కేంద్రంలో పుట్టుకతో గుండెకు సంబంధించి లోపాలున్న పిల్లలకు చెన్నై అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ బాలభవిత కేంద్రంలో పుట్టుకతో వచ్చే గ్రహణమొర్రి, గ్రహణశూల, గుండె, నేత్ర, వినికిడి లోపం తదితర వ్యాధులకు వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు కూడా చేస్తున్నారని తెలిపారు. 18 ఏళ్లలోపు పిల్లలు ఇక్కడ వైద్య చికిత్సలు పొందవచ్చని తెలిపారు. అత్యంత ఖరీదైన కాంక్లియర్ లాంటి చికిత్సలు ఉచితంగా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డైస్ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ సురేష్‌బాబు, బాలభవిత కో ఆర్డినేటర్ డాక్టర్ యశ్వంత్, సెంటర్ మేనేజర్ జమీర్, పీపీయూనిట్ వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్‌సీ కేంద్రం పరిశీలన

అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత ఎన్ఆర్‌సీ(జాతీయ పోషకాహార కేంద్రం)ను పరిశీలించారు. ఇక్కడ ఐదేళ్ల లోపు చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంను పరిశీలించారు. వసతులను తనిఖీ చేశారు.

చట్టాలు, హక్కులపై అవగాహన అవసరం

- జిల్లా న్యాయాధికారి యామిని

కలువాయి, (ఆంధ్రజ్యోతి): చట్టాలు, హక్కులపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయాధికారి సీ యామిని అన్నారు. స్థానిక వెలుగు కార్యాయలంలో శనివారం జాతీయ మహిళా కమిషన్, న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన మహిళా న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ గృహహింస, వరకట్న వేధింపులు, మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సబ్‌కోర్టు జడ్జి బి గాయత్రి, జేఎంఎఫ్‌ఏ కోర్టు జడ్జి ఎల్ జగదీష్ కుమార్, డీఎల్ఎస్ఏ సెక్రటరీ కె వాణి, ఆత్మకూరు బార్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్‌కే రసూల్, కలువాయి ఎస్ఐ సుమన్, ఏపీఎం వీ రవికుమార్, మహిళలు పాల్గొన్నారు.

సర్వేకల్ కేన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

- రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మి

నెల్లూరు(వైద్యం), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సర్వేకల్ కేన్సర్‌పై మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి. లక్ష్మి వెల్లడించారు. శనివారం ఆసుపత్రిలో సర్వేకల్ కేన్సర్‌పై ఇర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఈ కేన్సర్ అన్ని రకాల కేన్సర్‌లలో రెండవ స్థానంలో ఉందని ప్రపంచ ఆరోగ్యసంస్థ గుర్తించిందన్నా రు. 95 శాతం సర్వేకల్ కేన్సర్ హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిల్లోమా వైరస్) వల్ల సంక్రమిస్తుందన్నారు. మహిళల్లో సర్వేకల్ కేన్సర్ కాకుండా యోని కేన్సర్, మలద్వారం పేగు కేన్సర్, నోటి, గొంతు కేన్సర్‌లు రావచ్చన్నారు. 9 ఏళ్ల పైబడిన ఆడపిల్లల్లో, 15 ఏళ్ల మగపిల్లల్లో ఆరు నెలల వ్యవధిలో రెండు సార్లు వ్యాక్సిన్ వేసుకోవాలని సూచించారు. వివాహితలు ఏడాదికి లేదా మూడేళ్లకు ఒక సారైనా తెల్లమైలు పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. దీని వల్ల సర్వేకల్ కేన్సర్‌ను నివారించికోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరావు, జనరల్ మేనేజర్ భక్తవత్సలరెడ్డి, అంకాలజిస్ట్ డాక్టర్ గీతా ఉషశ్రీ, సర్జకల్ అంకాలజిస్ట్ డాక్టర్ నందిత, రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు విజయకుమార్‌రెడ్డి, కౌన్సెనల్ కన్యాకుమారి, రోగులు, సహాయకులు పాల్గొన్నారు.

ట్రై సైకిళ్ల తయారీ కేంద్రాన్ని పునఃప్రారంభించాలి

నెల్లూరు(హరనాథపురం), జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మూత పడిన ట్రై సైకిళ్ల కర్మాగారాన్ని తిరిగి ప్రారంభించి సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర దివ్యాంగుల హక్కుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు షేక్.కాలేషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 40 ఏళ్లుగా జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు ట్రై సైకిళ్ల తయారు చేసి అందజేసే వారని, గత కొన్నేళ్లుగా జిల్లా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ కర్మాగారం మూతపడిందని పేర్కొన్నారు.

ప్రయాణికురాలి మెడలో గొలుసు చోరీకి యత్నం

- నిందితురాలికి దేహశుద్ధి

నెల్లూరు(క్రైం), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళ మెడలోని గొలుసును తెంపుకొని పారిపోతున్న నిందితురాలికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసుల సమాచారం మేరకు.. ఆకుతోటకు చెందిన హేమలత నగరంలోని ఓ ఇన్సూరెన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. శనివారం విధులకు వెళ్లేందుకు ఆమె ఆకుతోట సమీపంలో ఆటో ఎక్కారు. అప్పటికే ఆటోలో ఓ మహిళ కూర్చుని ఉంది. ఆటో ఫ్లైఓవర్ బ్రిడ్జి దాటి కొద్దిగా ముందుకు వచ్చేసరికి ఆ మహిళ వాంతి వస్తుందని ఆటో ఆపాలని డ్రైవర్‌ను కోరింది. దీంతో డ్రైవర్ ఆటోను రోడ్డు పక్కకు ఆపుతుండగా మహిళ ఒక్కసారిగా హేమలత మెడలోని గొలుసును తెంపుకొని పరారయ్యేందుకు యత్నించింది. క్షణాలోనే తేరుకున్న బాధితురాలు ఆమె జుట్టును పట్టుకుని పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకున్నారు. నిందితురాలికి దేహశుద్ధి చేసి బాలాజీనగర్ పోలీసులకు అప్పగించారు. నిందితురాలు కోడూరుపాడు ప్రాంతానికి చెందిన పాత నేరస్థురాలని గుర్తించిన పోలీసులు మరిత లోతుగా ఆమెను విచారిస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	129
లేయర్ లైవ్	88
స్కిన్ చికెన్	232
స్కిన్‌లెస్	256
లేయర్	150

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7658
వెండి కిలో ధర	రూ. 93,100
వెండి ఒక గ్రాము	రూ.96.10




సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

విజన్-2047లో భాగస్వాములవుదాం : ఎస్ఈ విజయన్

నెల్లూరు(జడ్పీ), జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి తలపెట్టిన విజన్-2047లో అందరూ భాగస్వాములు కావాలని విద్యుతుశాఖ ఎస్ఈ విజయన్ పిలుపునిచ్చారు. నగరంలోని కోటమిట్ట విద్యుత్ కార్యాలయంలో సోలార్ విద్యుత్‌పై వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజన్-2047లో భాగంగా వినియోగదారులంతా సోలార్ వినియోగంపై దృష్టి సారించి ప్రతి ఒక్కరు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇందుకు ప్రభుత్వం పెద్దఎత్తున సబ్సిడీలు అందిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోలార్ విద్యుత్‌కు అదనపు డబ్బులు ఎవ్వరికి చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో డీఈలు అశోక్, సునీల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వాగ్గేయకారుడు సద్గురు త్యాగరాజ స్వామి 178వ ఆరాదనోత్సవం శనివారం నగరంలోని త్యాగరాజనగర్‌లోని త్యాగరాజస్వామి మందిరంలో కనుల పండువగా జరిగింది. ఉదయం అభిషేకాలు, అనంతరం భిక్షాటన జరిగింది. భక్తులు నగర సంకీర్తనలు చేశారు. అలాగే ఔత్సాహిక సంగీత విద్వాంసులు త్యాగరాజకృతులను గానం చేశారు. అనంతరం స్వామివారికి ప్రాకార పల్లకీ ఉత్సవం త్యాగరాజ కృతుల ఆలాపనలతో సాగింది. మాచవోలు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఆరాధన పూజలు జరిగాయి. సీతారామచంద్రమూర్తి, మూలవర్లుకు విశేష పుష్పాలంకారం, దీపాలంకరణ కనువిందు చేశాయి. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణలు జరిగాయి. ఈ కార్యక్రమాలకు త్యాగరాజ సేవా సమితి కార్యదర్శి వై.నాగదేవీ ప్రసాద్ సేవా సమితి సభ్యులు పర్యవేక్షించారు.



త్యాగరాజ కృతులను గానం చేస్తున్న సంగీత కళాకారులు

రవాణాశాఖ మంత్రిని కలిసిన అధికారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు వచ్చిన రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని శనివారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో రవాణా శాఖ అధికారుల మర్యాదపూర్వకంగా కలిశారు. ఇన్‌చార్జ్ డీటీసీ శ్రీచందన ఆధ్వర్యంలో అధికారులు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్టీవో సుధాకర్ రెడ్డి, ఎంవీఐలు, ఏఎంవీలు పాల్గొన్నారు.



మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన రవాణాశాఖ అధికారులు

తీరప్రాంత వైసీపీ ముఖ్య నేతల సమావేశం

- వైసీపీ ఇన్‌చార్జిపై గళం విప్పిన అసమ్మతి

కావలి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డిపై నియోజకవర్గ తీరప్రాంత వైసీపీ మత్స్యకార ముఖ్య నేతలు అసమ్మతిగళం విప్పుతున్నారు. మండలంలోని పెదపట్టపుపాలెం, తుమ్మలపెంట, అన్నగారిపాలెం, బోగోలు మండలం జువ్వలదిన్నె, సీఆర్‌పాలెం, అల్లూరు మండలం ఇస్కపల్లి పంచాయతీలకు చెందిన పార్టీకి చెందిన కొందరు ముఖ్యనేతలు శుక్రవారం తుమ్మలపెంటలో రహస్య సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి పనితీరు బాగాలేదని ఆయన్ను ఇన్‌చార్జిగా తొలగించేట్లుగా వైసీపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించుకున్నట్లు తెలిసింది. ఎంతో కాలంగా కాంగ్రెస్‌కు ఆ తర్వాత వైసీపీకి కంచుకోటగా ఉన్న నియోజకవర్గంలో 2024 ఎన్నికల్లో టీడీపీకి 30వేల పైన మెజార్టీ రావటం చూస్తే ప్రతాప్‌రెడ్డిపై ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తోందని చర్చించుకున్నట్లు తెలుస్తోంది. ఆయన వైసీపీ శ్రేణులకు సరైన గౌరవం ఇవ్వటం లేదని మనమెవరో తెలియని వారుగా ప్రవర్తిస్తున్నారని మాట్లాడుకున్నట్లు సమాచారం. కావలిలో వైసీపీని కాపాడుకుని క్యాడర్‌ను నిలబెట్టు కోవాలంటే ఇన్‌చార్జిని మార్చాలనే అభిప్రాయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

డీసీసీబీ మేనేజర్ కుటుంబానికి ఆర్థిక సాయం

నెల్లూరు (హరనాథపురం) జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని వాకాడు డీసీసీబీ బ్రాంచ్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న ఎస్ఆర్ శ్రీధర్ అకాల మరణం చెందడంతో డీసీసీబీ ఉద్యోగులంతా ఒకరోజు వేతనాన్ని ఆయన కుటుంబ సభ్యులకు విరాళంగా అందజేశారు. వసూలు అయిన రూ.1.60లక్షల చెక్కు. డీసీసీబీ సీఈవో శ్రీనివాసరావు శనివారం శ్రీధర్ భార్య ఎస్ ఆర్.కార్తీకకు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం సీనియర్ నాయకులు కుమార్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఇతర కులాలను తొలగించండి

అల్లూరు, జనవవరి 18 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో చేపట్టిన కులగణన ప్రక్రియలో ఇతర కులాలను ఎస్సీల్లో చేర్చారని వాటిని వెంటనే తొలగించాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు డిమాండ్ చేశారు. ఈ విషయంపై శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు ఉరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంగులూరు సుదాకర్, ఉసురుపాటి రమణయ్య, నేతగాని అన్వేష్, కాకాని కరుణాకర్, చెంతాటి ప్రణయ్‌కుమార్, దగ్గోలు వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ చేయించుకోవాలి

జలదంకి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతులు వీఏఏల వద్ద ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవ సాయాధికారి శైలజ తెలిపారు. వరిసాగు, ఇతర పంటలు సాగుచేసిన రైతులు రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

కుష్ఠువ్యాధిపై ఇంటింటి సర్వే

బిట్రగుంట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇంటింటి సర్వే నిర్వహించాలని కోవూరుపల్లి వైద్యాధికారి జిహారిక తెలిపారు. కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం వైద్యశాఖ సిబ్బందితో పాటు ఎంఎల్‌హెచ్, ఏఎన్ఎం, ఆశావర్కలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సులోచన, పీహెఎన్ ఎఫ్ఎస్ మేరీ, హెచ్‌వీ విక్టోరియారాణి ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి

కలిగిరి, జనవరి18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మెట్టుకూరు శిరీష మాట్లాడారు. ఏపీ మోడల్ స్కూల్‌కి వెళ్లే విద్యార్థులకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను కోరారు. కార్యక్ర మంలో ఎంపీడీఓ ప్రత్యూష, జెడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తుంపర్ల సేద్యంతో నీరు ఆదా

కలిగిరి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బిందు, తుంపర్ల సేద్యంతో నీరు, విద్యుత్ ఆదా చేసుకోవచ్చని ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం బిందు, తుంపర్ల సేద్యంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీ ఎంఐపీ జిల్లా కోఆర్డినేటర్ నరేష్, ఉద్యానశాఖ, ఏఓ సురేష్‌బాబు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమిపూజ

దగదర్తి, (బిట్రగుంట) జనవరి 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి శనివారం శ్రీరామపురంలో పార్టీ కన్వీనర్ హనుమంతరావుతో కలిసి సీసీరోడ్డు పనులకు భూమి పూజ చేశారు. అంతకుముందు ఎన్టీ రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కొండూరు శేషారెడ్డి, నేతలు జలదంకి శ్రీహరి, శ్రీనివాసులురెడ్డి, పులి శీనయ్య, మల్లికార్జునరెడ్డి, అల్లంరాధయ్య, కొండయ్య ఉన్నారు.

- వాడవాడలా ఎన్టీఆర్ వర్ధంతి
- ఘన నివాళులర్పించిన నేతలు, కార్యకర్తలు
- పలుచోట్ల అన్నదానం


జలదంకి: బస్టాండ్ కూడలిలో నివాళులర్పిస్తున్న నాయకులు


ఆత్మకూరు: నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు


కందుకూరు: రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే ఇంటూరి

తెలుగువారు గర్వించదగ్గ నేత ఎన్టీఆర్


బిట్రగుంట:రక్తదానం చేస్తున్న టీడీపీ యువనేత భానుచందర్ నాయుడు


కావలి: రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి తదితరులు


ఉదయగిరి: నివాళులర్పిస్తున్న చెంచలబాబు, నాయకులు

ఆత్మకూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ, మండల పరిధిలో పలు ప్రాంతాల్లో శనివారం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో నేతల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించి రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. దేపూరు, ఆరవీడు జంగాలపల్లి, కరటం పాడులో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు కేతా విజయభాస్కర్‌రెడ్డి, సుంకర పెంచలచౌదరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, మహిళా కార్యదర్శి పులిమి శైల జారెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రా వెంకటసుబ్బానాయుడు సాగునీటి సంఘం చైర్మన్ మస్తాన్‌నాయుడు పాల్గొన్నారు.

● సంగం: స్థానిక జాతీయ రహదారి కూడలి వద్ద ఎన్టీఆర్ జంక్షన్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, అన్నారెడ్డిపాళెం నీటి సంఘం అధ్యక్షుడు సూరా శ్రీనివాసులురెడ్డి, షేక్ బాబు పాల్గొన్నారు. జంగాలకండ్రిక, వంగల్లు, మర్రిపాడు గ్రామాల గర్భిణులకు మాజీ జడ్పీటీసీ సభ్యులు గంగపట్నం చంద్రశేఖరయ్య చేతుల మీదుగా పండ్లను పంపిణీ చేశారు. చిన్నారులకు స్నాక్స్ పంపిణీ చేశారు.

● ఏఎస్‌పేట: టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బూరి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కాటంరెడ్డి నరసింహారెడ్డి, షేక్ జిలానిభాష, మాల్యాద్రి నాయుడు, వివేకానందరెడ్డి, ఖాదర్‌భాష పాల్గొన్నారు.

● చేజర్ల: నాగులవెల్లటూరులో సోమశిల ప్రాజెక్టు చైర్మన్ వేలూరు కేశవచౌదరి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, అన్నదానం నిర్వహించారు. చేజర్ల బస్టాండు సమాదాయంలోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ సీనియర్ నాయకులు రావి పెంచలరెడ్డి, రావి లక్ష్మీనరసారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదురుపల్లిలో చీర్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

● కలువాయి : స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు ఆధ్వర్యంలో నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● అనంతసాగరం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎన్‌డీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజ య రెడ్డి, కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షురాలు సునీత, శాకమూరి సుబ్బారావు, సుబ్బారెడ్డి, మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.

● మర్రిపాడు: మండల కేంద్రంలో ఎన్టీఆర్ నాయకులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిక్కవరం, చిన్నమాచునూరు గ్రామాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల కన్వీనర్ శాఖమూరి నారాయణ, వెంకటేశ్వర్లు, లక్ష్మీనరసయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

● ఉదయగిరి: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ స్థానిక పంచాయతీ బస్టాండ్ సెం టర్‌లో నాయకులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు, దు ప్పట్లు పంపిణీ చేశారు. గంగిరెడ్డిపల్లిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి నివాసంలో నాయకులు ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, షేక్ రియాజ్, బొజ్జా నరసింహులు పాల్గొన్నారు.

● దుత్తలూరులో: దుత్తలూరు, నందిపాడు సెంటర్లలో మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు టీడీపీ నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, నాయకులు శ్రీకుర్తి రవీంద్రబాబు, కాకర్ల మధు, వెంగళరెడ్డి, మండవ మధు పాల్గొన్నారు.

● వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) : స్థానిక పార్టీ కార్యాలయ ప్రాంగణంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. అలాగే జడదేవి, ధర్మవరం గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు ముజ్జె లక్ష్మీనారాయణ, నాయకులు దేవనబోయిన మధు, పొద మాధవరావు, ఆవుల అరుణ, తదితరులు పాల్గొన్నారు.

● సీతారామపురం: స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, సీతారామపురం సర్పంచ్ భాగ్యకుమారి, మాజీ జడ్పీటీసీ కలివెల జ్యోతి ,మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, సర్పంచ్ ఆదినారాయణ, టీడీపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● వింజమూరు: చంద్రపడియ పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు వేమూరి దొరస్వామి నాయుడు, కొంపల్లి వెంకటనారాయణ పాల్గొన్నారు. అలాగే పాతబస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రఘునాధరెడ్డి, నాయకులు గణపం సుదర్శన్‌రెడ్డి, గూడా నర్సారెడ్డి, ఎమ్మెస్ నాయుడు, కొండపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

● అల్లూరు: స్థానిక వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్‌లో సమీపంలో తారక రామారావు చిత్రపటానికి పార్టీ నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, అరగల రమణయ్య, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, అంబటి రాజేంద్ర, తిరుమల, ఇస్మాయిల్, పాల్గొన్నారు. అలాగే నార్తుఆములూరులోని అనాధ ఆశ్రమంలోని బాలలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దాసరి ప్రభాకర్, పెయ్యల బాస్కర్, చల్లా శీనయ్య, చల్లా రమణయ్య, చల్లా పిచ్చయ్య పాల్గొన్నారు.

● జలదంకి: స్థానిక బస్టాండు సెంటరు, బ్రాహ్మణక్రాక పంచాయతీ 9వ మైలు, గట్టుపల్లి పంచాయతీల్లో నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మధురెడ్డి, వంటేరు జయచం ద్రారెడ్డి, పూనూరు భాస్కర్‌రెడ్డి, తల్లపనేని మధుసూదనరావు, దగుమాటి మాల్యాద్రిరెడ్డి, కరియావుల అప్పలయ్యనాయుడు, కూరపాటి మాలకొండారెడ్డి, కొల్లా క్రిష్ణ పాల్గొన్నారు.

● కావలి: ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ట్రంకురోడ్డు ఎన్టీఆర్ విగ్రహం, వైకుంఠపురంలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ట్రంకు రోడ్డులో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంను ప్రారంభించి రక్తదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషో ర్‌బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబూరావు, రాష్ట్ర కార్యదర్శి మ లిశెట్టి వెంకటేశ్వర్లు, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, పోట్లూరు శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని 31వ వార్డు వైసీపీ ఇన్ చార్జి తలపనేని ప్రభాకర్ వార్డు నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే ఆయనకు టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

● లింగసముద్రం: టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు లింగసముద్రంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గాలంకి ప్రసా ద్, కండే మాలకొండయ్య, ఎ చిన కొండయ్య, బాబు, జంపాల శివప్రసాద్, జంపాల శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● ఉలవపాడు: మండలకేంద్రంతో పాటు చాగొల్లు, ఆత్మకూరు, వీరేపల్లి, కరేడు, భీమవరం, మన్నేటికోట, రామాయపట్నం, బద్దిపూడి, పెద పట్టుపుపాలెంలో ఎన్టీఆర్ విగ్రహాలకు నేతలు పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలు, అభిమానులకు అల్పాహారం, రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు.

● కొండాపురం: మండలకేంద్రంలో యారవ కృష్ణయ్య, పోలినేని రమేష్, పోలినేని చంద్రబాబునాయుడు, దాసరి అశోక్, కుంకు మోహన్‌రావు, దగడ మాలకొండారెడ్డి, చాగంటి కృష్ణ, తిమోతిలు తారకరామారావు వర్ధంతిని నిర్వహించారు. అలాగే సాయిపేట పంచాయతీ ఇస్కపాలెంలో యువ నాయకుడు దామా శివబాబు ఆధ్వర్యంలో నివాళులర్పించి, అన్నదానం చేశారు.

● కలిగిరి: టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృ ష్ణారెడ్డి ఆధ్వర్యంలో మండలకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మెట్టుకూరు శిరీష, పో లీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ మెట్టు కూరు చిరంజీవిరెడ్డి, చీమల తాతయ్య, గంజాం రాఘవేంద్ర, వెంగపనాయుడు, వర ప్రసాద్ పాల్గొన్నారు.

● కావలి రూరల్: టీడీపీ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ తుమ్మలపెంటలో పూలమాలలు నివాళులర్పించారు.

● బిట్రగుంట: టీడీపీ కార్యాలయంలో కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోడూరు వెంకటేశ్వరరెడ్డి, ఎల్.సుధీర్, ముంతాల వెంకయ్య యర్రం వేంకటేశ్వర్లురెడ్డి, పిన్నిబోయిన సుధాకర్, నాగరాజు, రామోహనరెడ్డి, మనోహర్ ఉన్నారు.

దగదర్తి, (బిట్రగుంట): టీడీపీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బానాయుడు మండలకేంద్రంలో పూలమాలు వేసి నివాళులర్పించారు. మసీదు సెంటర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించి సుజల స్రవంతి వాటర్ ప్లాంట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాలేపాటి సోదరులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం పాల్గొన్నారు. అనంతరం వెయ్యి మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. యువనేత మాలే పాటి భానుచందర్‌నాయుడు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు, సీనియర్ నేత సుధాకర్ నాయుడు, వినయ్‌కుమార్ ఉన్నారు.

● కందుకూరు:నియోజకవర్గ శాసనస భ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యే దివి శివరాంలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించార. ఎన్టీఆర్ విగ్రహం నుంచి వెంగమాంబ ఫంక్షన్ హాల్ వరకు కార్యకర్తలు, నాయకులు భారీ ర్యాలీ నిర్వహించి, టీడీపీ జెండాను ఆవిష్కరించారు. వెంగమాంబ ఫంక్షన్ హాల్‌లో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 260మంది తెలుగు తమ్ముళ్ల రక్తదానం చేశారు. అలాగే అన్న క్యాంటీన్లో ప్రత్యేకంగా రైతు బజార్ సెక్రటరీ పచ్చవ నవీన్ అన్నదానం చేపట్టారు.

● వలేటివారిపాలెం: మండలకేంద్రంలో నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి కార్యకర్తలకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో కాకుమాను ఆంజనేయులు, పార్టీ మండలాధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, పరిటాల భాస్కర్‌రావు, మధుసూధన్‌రావు ఉన్నారు.

పైపులైనుకు మరమ్మతుల ప్రారంభం

కలువాయి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి సమీపంలో దెబ్బతిన్న అదనపు తాగునీటి పథకం పైపులైనుకు శనివారం మరమ్మతులు చేశారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో నాసిరకంగా జల్ జీవన్ మిషన్ పనులు శీర్షికన వార్త ప్ర చురితం కావడంతో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో పాటు కాంట్రాక్టర్ స్పందించారు. వెంటనే పైపులైన్‌కు మరమ్మతులు చేసి నీటి పథకాన్ని ఉపయోగంలోకి తీసుకొచ్చారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


పైపులైనుకు మరమ్మతులు చేస్తున్న కూలీలు

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

ఉదయగిరి, జనవరి 18(ఆంధజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు 264 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 117 మంది మాత్రమే హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరిడెంటెండ్, డిపార్టుమెంట్ అధికారులు బాలకేశవులు, యమునాలక్ష్మిలు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణను తహసీల్దారు సుభద్ర తనిఖీ చేశారు.

● దుత్తలూరు: దుత్తలూరు ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం నిర్వహించిన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆయా పరీక్షా కేంద్రాలకు 472 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 276 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు

సీతారామపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : సీతారామపురం గ్రామ పంచాయతీలోని సబ్‌స్టేషన్ వద్ద సంక్రాంతి సందర్భంగా జాలి ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ నాసేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ సభ్యులు భోగినేని కాశీరావు, తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, షేక్ కరిముల్ల సహకారంతో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు భోగినేని కాశీరత్తయ్య, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, అయ్యవారిపల్లి సర్పంచ్ దుర్గ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికల ఆవిష్కరణ

ఉదయగిరి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 1, 2, 3వ తేదీల్లో నెల్లూరు జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య కోరారు. అందులో భాగంగా శనివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోడె రమణయ్య, ఈర్ల తిరుపతయ్య, నాయబ్, మన్నేటి మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఉదయగిరి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రైతులు పంటలను ఆశించే పురుగులు, తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని బండగానిపల్లి గ్రామాల్లో సాగులో ఉన్న మొక్కజొన్న పంటను పరిశీలించారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

- వాడవాడలా స్వచ్ఛాంధ్ర ర్యాలీలు, మానవ హారాలు


దుత్తలూరులో ప్రతిజ్ఞ చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి

ఉదయగిరి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛత దివస్ కార్యక్రమం చేపట్టిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం పరిశుభ్రతపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వ హించారు. అలాగే స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఏ శ్రీనివాసులు, విద్యా శాఖ కార్యాలయంలో ఎంఈవో షేక్ మస్తాన్‌వలిల ఆధ్వర్యంలో కార్యాలయాలు, ఆవరణలో ఉన్న చెత్తా చెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ ముర్తుజా హుస్సేన్, పంచాయతీ ఈవో షేక్ కరీముల్లా, ఏపీవో శ్రీనివాసులు, పలు శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●దుత్తలూరు: స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 565 జాతీయ రహదారిపై మానవ హారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, ఎంపీడీవో మీసాల వెంకటేశ్వర్లు, టీడీపీ మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, ఈవోపీఆర్డీ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి నజీముల్లా పాల్గొన్నారు.

●ఉదయగిరి రూరల్: ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని గండిపాళెం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజరు శోభన్‌బాబు అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛత దివస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక బ్యాంకులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఇంతియాజ్, క్లర్కులు అజయ్, రమేష్, మెసెంజరు చిన్నఖాశిం, ఖాతాదారులు పాల్గొన్నారు.

●వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): ఎంపీడీవో వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు స్థానిక కార్యాలయం నుంచి జాతీయ రహదారి మీదుగా బస్టాండ్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే ఎస్ఐ రఘునాథ్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ ఆవరణలో పరిశుభ్రత చేపట్టారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, ఏపీవో ఆజంఖాన్, ఈవోపీఆర్డీ నాగూర్‌వలి, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

●సీతారామపురం: సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి ఆధ్వర్యంలో శనివారం బిట్-1 సచివాలయం వద్ద నుండి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, మండల అధికారులు, ఆరోగ్య సిబ్బంది. టీడీపీ నేతలు పాల్గొన్నారు.

●వింజమూరు: స్థానిక పీఏసీఎస్ ప్రాంగణంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోఆపరేటివ్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ బయోపిరెడ్డి సురేందర్‌రెడ్డి, సంఘ సీఈవో మేకల రమణయ్య, తదితరులు పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఎంపీడీవో కె.శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్ నుంచి బంగ్లా సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అలాగే జనార్ధన పురం గ్రామంలో పంచాయతీ సెక్రటరీ శిరీష పలు వీధుల్లో పంచాయతీ సిబ్బందిచే శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లించారు.

●ఆత్మకూరు : మున్సిపాల్టీటి పరిధిలోని టెంకాయతోపు ప్రధాన కూడలి వద్ద స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో వేసి ఉన్న చెత్తను తొలిగించి తులసి కోటను ఏర్పాటు చేశారు. స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తు అధికారులు, టీడీపీ నేతలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమి షనర్ గంగా ప్రసాద్, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, మాజీ వైస్‌చైర్మన్ తుమ్మల చంద్రారెడ్డి, టిడిపి నేతలు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, జి బుజ్జిరెడ్డి పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. కరటంపాడు, బట్టేపాడు, ఆరవీడు తదితర గ్రామపంచాయతీల్లో ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ పాల్గొని స్వచ్ఛత గురించి ప్రతిజ్ఞ చేయించారు.

●సంగం : స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి షాలెట్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి బంగ్లా సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

●కలువాయి: బ్రాహ్మణపల్లిలో శనివారం గ్రామ సర్పంచు ఎం పెంచలమ్మ, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛత దివస్ ర్యాలీ నిర్వహిం చారు. ఈకార్యక్రమంలో నాయకులు బట్టెడ్డి శ్రీని వాసులరెడ్డి, మండల కోఆర్డినేటర్ పార్లపల్లి సునీల్ పాల్గొన్నారు.

●మర్రిపాడు: స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛత దివాస్ కార్యక్రమం లో భాగంగా గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్ తెలిపారు. శనివారం అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, నాయకులు ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.

స్వచ్ఛ కావలి లక్ష్యం : మున్సిపల్ కమిషనర్

●కావలి: మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీని మున్సిపల్ కార్యాలయం నుంచి రైల్వే రోడ్డు మీదుగా ట్రంకురోడ్డులోని ఉదయగిరి బ్రిడ్జి కూడలికి చేప ట్టారు. ర్యాలీలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

●అల్లూరు : నగర పంచాయతీ కమిషనర్ ఉమమహేశ్వర రావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. నగర పంచాయతీ కార్యాలయం నుంచి ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కార్యదర్శి వరప్రసాద్, సచివాలయ సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

●బిట్రగుంట: విశ్వనాథరావుపేట, బోగోలు పంచాయతీలో ఎంపీడీవో సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఇబ్రహీంపేట నుంచి బోగోలు అంబేద్కర్ విగ్రహం కూడలి వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం ఇబ్రహీంపేట, కప్పరాళ్లతిప్ప మధ్యలోని ఆర్‌అండ్‌బీ రోడ్డుపక్కన ఉన్న చెత్తతొలగించారు. కార్యక్రమంలో గండూరి శ్రీనివాసులు, నేతలు ఎల్.సుధీర్‌బాబు, పిన్నిబోయిన సుధాకర్, ఈవోపీఆర్డీ నయీం తాజ్‌హుసన్, ఏపీఎం శ్రీనివాసులు ఉన్నారు.

● కొండాపురం: ఎంపీడీఓ ఆదినారాయణ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గుడవళ్లూరు సర్పంచ్ మాచర్ల, టెలికాం అడ్వయిజర్ బోర్డు మెంబరు అనూష, మాజీ వైస్ ఎంపీపీ చంద్రబాబునాయుడు, తెలుగు యువత మండల అధ్యక్షుడు దాసరి అశోక్ పాల్గొన్నారు.

● కలిగిరి: ఎంపీడీఓ ప్రత్యూష పట్టణంలో ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శిరీష, చిరంజీవిరెడ్డి, బిజ్జం కృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● కందుకూరు : కందుకూరు డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పారిశుధ్య పనులు చేపట్టినట్లు డీఎస్పీ సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. గుడ్లూరు సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ మంగారావు, కందుకూరు సర్కిల్ పరిధిలోని స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వరరావు పర్యేక్షణలో ఆయా స్టేషన్ల ఎస్ఐలు పారిశుధ్య పనులు చేపట్టారు.

●లింగసముద్రం : ఎంపీడీఓ శ్రీనివాసులు లింగసముద్రంలో అధికారులు, సిబ్బందితో కలిసి స్వచ్ఛ ఆంధ్ర దివాస్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్థానిక తిరుమణిశెట్టి కోటయ్య మందిరం వద్ద మానవహారం నిర్వహించి, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

● ఉలవపాడు : ఎంపీడీవో ఎస్.విజయ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ప్రతినెలా 3వ శనివారం ఈ కార్యక్రమం చేపట్టి ఇంటి నుంచి మొదలు వీధి, గ్రామం వరకు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి వీరయ్య, సచివాలయం ఉద్యోగులు, అంగన్‌వాడీ, వెలుగు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు కర్మాగారానికి పూర్వ వైభవం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై చిత్తశుద్ధి కలిగిన ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కేవలం ఆరు నెలల వ్యవధిలో విశాఖ ఉక్కు కర్మాగారానికి ప్రత్యేక నిధులు కేటాయించడం అభినందనీయమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ సింగ్ పేర్కొన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదానికి జీవం పోస్తూ కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.11,500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను లాభాల్లో తేవడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లాల్ ఖాజా మస్తాన్, కపూర్, శౌరి శ్రీనివాస్, మోతి సింగ్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కావ్యాంజలికి అభినందన

నెల్లూరు(విద్య), జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్స్ కార్యక్రమంలో నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విద్యార్థిని నామాల కావ్యాంజలి పాల్గొని ప్రతిభచాటినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కళాశాలలో శనివారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ సమక్షంలో ఇటీవల జరిగిన ఈ కార్యక్రమానికి తమ విద్యార్థిని ఎంపికై మాట్లాడడం అభినందనీయమన్నారు. భారతదేశాన్ని స్పోర్టింగ్, ఫిట్‌నెస్‌గా మార్చడం అనే సంభాషణ థీమ్‌తో కావ్యాంజలి పాల్గొని అందరి ప్రశంసలు అందుకున్నారన్నారు. అనంతరం విద్యార్థినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ బి.దత్తాత్రేయశర్మ, ఈసీఈ హెడ్ డాక్టర్ కె.మురళి, అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరులో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రెడ్డయ్య, సిబ్బంది

స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్

సైదాపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ రాఘవేంద్ర, ఏపీఎం చంద్రశేఖర్, ఏపీవో చంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు, సీసీలు, వివోఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మనుబోలు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): గూడూరులోని 143 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు చేపట్టేందుకు ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మండల వ్యాప్తంగా కరెంటు సరఫరాకు ఉండదని ట్రాన్స్‌కో ఏఈ అనిల్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

కనుల పండువగా పెంచలోరి కల్యాణం

రాపూరు,(ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో శనివారం స్వామివారి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. సాయంత్రం చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మీ సమేత నరసింహస్వామి తిరుచ్చి పల్లకీసేవను ప్రధాన అర్చకులు వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

సెమీస్‌కు చేరిన నాలుగు జట్లు

మనుబోలు(ఆంధ్రజ్యోతి): స్థానిక క్రీడా మైదానంలో ఎన్ఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్న మండలస్థాయి క్రికెట్ టోర్నీ పోటీలు సెమీస్ వరకు చేరాయి. శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్ పోటీలో ముందుగా మనుబోలు మెయిన్‌టీమ్, కొమ్మలపూడి జట్లు విజయం సాధించాయి. ఆదివారం మనుబోలు మెయిన్‌టీమ్, ఎంజీసీటి జట్టుకు, కొమ్మలపూడి, అక్కంపేట జట్ల మధ్య సెమీఫైనల్స్ జరగనున్నాయి. మధ్యాహ్నం ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు తెలిపారు.

రవాణాశాఖ కార్యాలయంలో వైద్య శిబిరం

నెల్లూరు(క్రైం), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డుభద్రతా మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని డీటీసీ కార్యాలయంలో శనివారం రెయిన్‌బో వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఇన్‌చార్జ్ డీటీసీ శ్రీచందన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బో వైద్యశాల సూపరింటెండెంట్ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

కండలేరు నీటిమట్టం 55.77 టీఎంసీలు

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : కండలేరు పూర్తి నీటిమట్ట సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 55.77 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ కట్ట తిరుమలయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో సోమశిల వరద కాలువల ద్వారా ఇన్‌ఫ్లో 180 క్యూసెక్కులుగా ఉన్నదని, వివిధ కాలువల ద్వారా అవుట్ ఫ్లో 1205 క్యూసెక్కులు వెళ్తుందని ఆయన తెలిపారు.

సంక్షేమ రంగానికి ఆద్యుడు ఎన్టీఆర్ : ఎంపీ వేమిరెడ్డి



గిరిజనులకు దోమతెరలు అందచేస్తున్న ఎంపీ వేమిరెడ్డి

ఇందుకూరుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ రంగానికి ఆద్యుడు ఎన్టీఆర్ అని నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్రమం శనివారం డేవిస్‌పేట గిరిజన కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. అదేవిధంగా జగదేవిపేటలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కూకటి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. కొత్తూరు బీసీ కాలనీలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మునగాల రంగారావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్రనాయుడు, పొన్నెబోయిన చెంచుకిషోర్‌యాదవ్, కొండూరు సుధాకర్‌రెడ్డి, అవ్వారు ఏడుకొండలు, కదురు రాధాకృష్ణారెడ్డి, దొడ్ల మల్లికార్జున, పాల్గొన్నారు.

● మనుబోలు,(ఆంధ్రజ్యోతి): ఏపీకి స్వర్గీయ నందమూరి తారకరామారావు ఒక బ్రాండ్ అని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఎన్టీఆర్ 29వ వర్ధంతిలో ఆయన పాల్గొన్నారు. ముందుగా పార్టీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించి, విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్టీఆర్‌తోనే పేదప్రజలకు సంక్షేమ పథకాలు, కొత్త పాలనా పద్ధతులు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆయన ఆశయాలను ఇవాళ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుసరిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, పొన్నూరు రామకృష్ణయ్య, మధునాయుడు, మస్తాన్‌నాయుడు, సాని వెంకటరమణయ్య, దండు చంద్రశేఖర్‌రెడ్డి, కలికి రమేష్‌రెడ్డి, రాజాగౌడ్, పచ్చిపాల శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

● నెల్లూరురూరల్, (ఆంధ్రజ్యోతి): సామాజంలో పురుషులతో పాటు స్త్రీలకు సమాన హక్కు కల్పించిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కొనియాడారు. శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా నెల్లూరురూరల్ నియోజకవర్గంలోని 33వ డివిజన్ వాటర్ ట్యాంకు దగ్గర నిర్వహించిన ఎన్టీఆర్ 29వ వర్ధంతి కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్‌తో కలసి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నెం పెంచలనాయుడు, కరణం హజరత్‌నాయుడు, డీ.బుజ్జయ్యనాయుడు, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

● నగరంలోని 12వ డివిజన్ చింతారెడ్డిపాళెంలో జరిగిన కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొని



మనుబోలు: పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వాడవాడలా ఘన నివాళి

పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

● గొల్లకందుకూరులో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొణక హరిప్రసాద్‌రెడ్డి, శివకుమార్ రెడ్డి, దయాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

● 2వ డివిజన్ గుడిపల్లిపాడు జంక్షన్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి కార్పొరేటర్ రామ్మోహన్‌యాదవ్, సీనియర్ నాయకులు పోలూరు సుబ్బయ్య, మేకల అనిల్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీకుమార్‌రెడ్డిలు పూల మాలలు వేసిన నివాళులర్పించారు.

● వేదాయపాళెం జక్షన్ వద్ద టీడీపీ నాయకుడు చెక్కా సాయిసునీల్, వేలూరు కళ్యాణ్‌రెడ్డిలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

● నెల్లూరు(వైద్యం,ఆంధ్రజ్యోతి): నగరంలోని గుప్తాపార్కులో జరిగిన ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నేతలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, డాక్టర్ గణేష్, మాజీ కార్పొరేటర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

● దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా వేదాయపాళెం సెంటర్‌లో టీడీపీ నేతలు పేదలకు అన్నదానం చేశారు. 28వ డివిజన్ కార్పొరేటర్ చెక్క అహల్య, డివిజన్ ఇన్‌చార్జ్ చెక్క సాయిసునీల్‌లు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● కోవూరు(ఆంధ్రజ్యోతి): స్థానిక వీఆర్ఆర్ కాలనీలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పేద లకు అన్నదానం, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, సర్పంచు విజయమ్మ, నాయకులు ఇంత మల్లారెడ్డి, గాదిరాజు అశోక్‌కుమార్ , యాకసిరి వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు. పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి కార్యాలయంలో పలువురు నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్రమౌళి నగర్ కాలనీలో పలువురు నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● కొడవలూరు(ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి దివంగత ఎన్టీఆర్ అని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి జీవీఎన్ శేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కొడవలూరులో దివంగత ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని మండల టీడీపీ నాయకులు ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కేతు వెంకటరమణారెడ్డి, జొన్న శివకుమార్, నాపా వెంకటేశ్వర్లునాయుడు, చెక్క మదన్, కోడూరు సుధాకర్‌రెడ్డి, తువ్వార ప్రవీణ్, మండల నాయకులు, పాల్గొన్నారు.

● బుచ్చిరెడ్డిపాళెం(ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి దివంగత ఎన్టీఆర్ చిరస్మరణీయుడు అని టీడీపీ నాయకులు అన్నారు. శనివారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా బుచ్చిలోని బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కు వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, రూరల్ అధ్యక్షుడు బత్తల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఎంవీ శేషయ్య మాట్లాడారు. ఓదివ్యాంగుడైన అభిమాని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులు, పేదలకు పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో రామానాయుడు, హరనాథ్, శీనయ్య, సుబ్బారావు, బాలకుమార్, కౌన్సిలర్లు ప్రత్యూష, వైష్ణవి, లక్ష్మీకాంతమ్మ, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

● సైదాపురం(ఆంధ్రజ్యోతి) : స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శనివారం టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం టీడీపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కట్టా మోహన్‌కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు నలమారు వెంకటేశ్వర్లురెడ్డి, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కొండూరు సుబ్రహ్మణ్యంరాజు, మండల నాయకులు



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

అమ్మినేని సుబ్రహ్మణ్యం నాయుడు, రాజశేఖర్ రాజు పాల్గొన్నారు.

● పొదలకూరు(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ బస్టాండులోని ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కోడూరు భాస్కర్‌రెడ్డి, కోవూరు వెంకటేశ్వర్లునాయుడు, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, అక్కెం సుధాకర్‌రెడ్డి, పులిపాటి రత్నంనాయుడు, బోగోలు భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● తోటపల్లిగూడూరు(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతో పాటు నరుకూరు సెంటర్, కోవెరపాలెం, సౌత్‌ఆములూరులో ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర పాల్గొన్నారు. కోవెరపాలెంలో టీడీపీ నాయకులు గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నరుకూరు ఎంపీటీసీ కొనతం రఘుబాబు, టీడీపీ మండల కార్యదర్శి ముత్యాల శ్రీనివాసులు, కోడూరు, వెంకన్నపాలెం నీటి సంఘం అధ్యక్షులు బాబు నాయుడు, సీతారామయ్య, ఇంగిలాల నిర్మలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాచలం(ఆంధ్రజ్యోతి) : వెంకటాచలంలోని మానసిక దివ్యాంగుల కేంద్రంలో ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే పిల్లలకు అన్నదానం చేసి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుమ్మడి రాజాయాదవ్, మావిళ్లపల్లి శ్రీనివాసులునాయుడు, దువ్వూరు లక్ష్మమ్మ, వెంకటకృష్ణయ్య నాయుడు, మునుస్వామి ఉన్నారు. అలాగే స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో బాలయ్య అభిమాన సంఘం మండలాధ్యక్షుడు ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అలాగే స్వర్ణదీపం చారిటబుల్ ట్రస్ట్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో కోటంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, రావూరి రాధాకృష్ణమనాయుడు, చల్లా నాగార్జున్‌రెడ్డి, వల్లూరు రమేష్ నాయుడు, ఈపూరు మురళీధర్‌రెడ్డి, ఉప్పలపాటి ధనుంజయనాయుడు ఉన్నారు.

● విడవలూరు(ఆంధ్రజ్యోతి): విడవలూరు మండలంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు టీడీపీ మండల పార్టీ ఇన్‌చార్జ్ అడపాల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో విడవలూరు అంకమ్మదేవాలయం సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. రామతీర్థంలో టీడీపీ నాయకులు శ్రీహరికోట గోపి, తాతా రమేష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అన్నదానం చేశారు. అనంతరం రామచంద్రాపురం పంచాయతీ, పొన్నపూడి కృష్ణదేవాలయంలో టీడీపీ నాయకులు అడపాల శ్రీధర్‌రెడ్డి, ఎస్‌కె రఫీలు దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొన్నలూరు పురందర్‌రెడ్డి, సత్యంవోలు సత్యంరెడ్డి, చలంచర్ల కామేశ్వరమ్మ, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ అహల్య, సాయిసునీల్

వైభవంగా గొబ్బెమ్మ గ్రామోత్సవం



గ్రామోత్సవంలో గొబ్బెమ్మ

మనుబోలు, జనవరి 18 (ఆంధ్ర జ్యోతి): స్థానిక చంద్రమౌళీనగర్ గిరిజన కాలనీ ప్రజలు భారీ గొబ్బెమ్మ బొమ్మను శనివారం కొలువుదీర్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక గజమాలలతో అలంకరించి పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. గిరిజన మహిళలు, పిల్లలు, యువత వివిధ నృత్యాలతో సందడి చేశారు. అనంతరం కండలేరు వాగులో నిమజ్జనం చేశారు.

నేత్రదానం

నెల్లూరు(వైద్యం), జనవరి 18 (ఆంధ్ర జ్యోతి) : నగరంలోని మైపాడుగేట్ వద్ద ఉన్న పాలమడి హజరత్తయ్య(75) శనివారం మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యుల కోరిక మేరకు ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ ఆయన నేత్రాలను సేకరించారు. అలాగే మృతుడి కుటుంబ సభ్యులకు నేత్రదాన గుర్తింపు కార్డును అందించారు. ఈ కార్యక్రమంలో నేత్రదాన మోటివేటర్ కిషోర్ పాల్గొన్నారు.

సీఎం సంకల్పాన్ని సాకారం చేద్దాం

● స్వచ్ఛాంధ్రలో నెంబర్‌వన్‌గా నిలుద్దాం ● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనువాసులురెడ్డి ● చీపురు పట్టి చెత్త ఊడ్చిన అధికారులు, ఉద్యోగులు

నెల్లూరు(జడ్పీ), జనవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రజలంతా పరిశుభ్రతను పాటించి, పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛాంధ్రలో నెల్లూరును నెంబర్‌వన్‌గా నిలుపుదామని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనువాసులురెడ్డి పిలుపునిచ్చారు. నుడా కార్యాలయంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నుడా కార్యదర్శి పెంచల్‌రెడ్డి, సిటీ ప్లానర్ హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు(వైద్యం,ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలలో అధికారులు చీపుర పట్టి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, ఫ్యామిలీ డాక్టర్ నోడల్ అధికారి డాక్టర్ దయాకర్, ఏవో డాక్టర్ వెంకటేశ్వర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మస్తాన్‌బాషా, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, బ్రహ్మరెడ్డి పాల్గొన్నారు.

● నెల్లూరు(విద్య,ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలలో మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించడంతో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఆర్.బాలాజీరావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్యలు చీపుర పట్టారు. డీఈవో కార్యాలయం ఆవరణ శుభ్రం చేశారు. అనంతరం సిబ్బంది, అధికారులు స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు, ఏడీలు పాల్గొన్నారు.

● నెల్లూరు(క్రైం,ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయం, క్యాంపు కార్యాలయం, జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్‌లలో శనివారం ఆంధ్ర స్వచ్ఛత దివస్ కార్యక్రమాన్ని నిర్వహించి స్టేషన్ ప్రాంగణాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ జి కృష్ణకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి శనివారం స్వచ్ఛత దివస్ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్‌లలో నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవా లన్నారు.

● నెల్లూరు (హరనాథపురం,ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

● జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి ఉదయ భాస్కర్ ఆధ్వర్యంలో అధికారులు, ఉద్యోగులు కలెక్టరేట్ ఆవరణంలో పిచ్చి మొక్కలు తొలగించారు. ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు జిల్లాలో జరుగుతున్నాయని డీఆర్వో చెప్పారు.



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కోటంరెడ్డి శ్రీనువాసులురెడ్డి, ఉద్యోగులు

● జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాలయంలో పీడీ నాగరాజకుమారి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది కార్యాలయం ఆవరణం శుభ్రం చేశారు. సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

● జిల్లా సహకార శాఖ అధికారి కార్యాలయంలో డీసీవో గురప్ప ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణను శుభ్రపరిచి మొక్క నాటారు.

● స్వర్ణాంధ్ర.. 2047కు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని ప్రకటించిన భారత్ సేవా ఫౌండేషన్ శనివారం నగరంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొని పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ కె.రాజసిఖామణి, ప్రధానోపాధ్యాయుడు కొమ్మల కృష్ణయ్య, విశ్రాంత ప్రిన్సిపాల్ మరుపూరు రత్నం, ముదివర్తి బాబు, జనార్దన్, పీ.రమణయ్య, ఖాజామొయిద్దీన్, మాధురి, తదితరులు పాల్గొన్నారు.

● ముత్తుకూరు,(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని స్వచ్ఛ ఆంధ్రగా మార్చేందుకు ప్రతిఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి కోరారు. బ్రహ్మదేవంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతిరోజు కొంత సమయాన్ని స్వచ్ఛత పరిసరాల పరిశుభ్రత కోసం కేటాయించాలన్నారు. ఈ సందర్భంగా స్థానికులకు చెత్త బుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధాకర్, టీడీపీ బ్రాహ్మణ సంఘ నాయకులు కొత్తపల్లి రమేష్‌శర్మ, అంకయ్య, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే ముత్తుకూరు పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జునయాదవ్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అబ్దుల్ షీఫీ ఉల్లా, ఏడుకొండలు పాల్గొన్నారు.

పొదలకూరు,(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో నరసింహారావు ఆధ్వర్యంలో అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ గేట్ సెంటర్ ప్రధాన కూడలి వరకు కొనసాగింది. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు తలచీరు మస్తాన్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ శివరామకృష్ణారెడ్డి స్టేషన్ ఆవరణంలోని పిచ్చిమొక్కలను తొలగించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, తల్లిక ప్రసాద్, వెలుగు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

●మనుబోలు,(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ ర్యాలీని అధికారులు స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి వైఎస్ విగ్రహం వరకు చేపట్టారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డి నారాయణ, కార్యదర్శి గరుడయ్య, సర్పంచు కంచి పద్మమ్మ పాల్గొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐ. శివరాకేష్, సిబ్బంది క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

● వెంకటాచలం(ఆంధ్రజ్యోతి): కాకుటూరు సమీపంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీఎస్‌యూలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో శుభ్రతా కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ సుబ్బా రావు, ఎస్ఐ అంజ నేయులు తమ సిబ్బందితో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. అలాగే అనికేపల్లి పరిధిలో ఉన్న ఎస్టీ హాస్టల్‌లో డ్వామా పీడీ గంగా భవాని, ఎంపీడీవో కల్పన నిర్వహించారు.

● ముత్తుకూరు(ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్షులు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జునయాదవ్, నాయకులు నర్సారెడ్డి, అక్కయ్యగారి ఏడుకొండలు, బొలిగర్ల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

● బుచ్చిరెడ్డిపాళెం(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నగర పంచాయతీ కమిషనర్ ఎల్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజమురళి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలతో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బుచ్చిలో జొన్నవాడ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు అవగాహనా ర్యాలీలో పాల్గొన్నారు. పట్టణంలో దుకాణదారులకు కరపత్రాలు పంపిణీ చేశారు. బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్లో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పోలీసులు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్, ఆవరణలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టినట్లు ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు. స్వచ్ఛ గ్రామాలుగా తయారు చేయడమే లక్ష్యమని ఎంపీడీవో శ్రీహరి అన్నారు. జొన్నవాడలో నిర్వహించిన పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించి గ్రామంలో చెత్తాచెదారాలు తొలగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచు పెంచలయ్య పాల్గొన్నారు.



చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న డీపీవో శ్రీధర్‌రెడ్డి

25 నుంచి అంతర్జాతీయ కాయిన్స్ ఎక్స్‌పో

నెల్లూరురూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నెల్లూరురూరల్లోని పార్థసారధి నగర్‌లో ఉన్న సద్గురు సిల్వర్‌ఓక్స్ స్కూల్లో ఈనెల 25 నుంచి అంతర్జాతీయ కాయిన్స్ ఎక్స్‌పో-2025 నిర్వహిస్తున్నట్లు స్కూల్ డైరెక్టర్ షణ్ముక ఆచారి తెలిపారు. శనివారం స్కూల్లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్స్‌పో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 30 దేశాలకు చెందిన వివిధ రకాలైన కరెన్సీ, పూరాతన కాలం నాటి నాణేలు, ప్రపంచంలోనే అతి పెద్ద, చిన్న నోట్లు, స్టాంపులు, రూ.6 కోట్ల విలువ మేరకు ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ ప్రదర్శన 25, 26వ తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సుధాకర్ రావు, అడ్మిన్ ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కోనేరు మార్కెట్‌లో షాపుల వేలం రేపు

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 18 (ఆంధ్రజ్యోతి) నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెందిన నెల్లూరు మద్రాసు బస్టాండు సమీపంలోని కోనేరు మార్కెట్‌లోని షాపులకు సోమవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి యం.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఏ బ్లాకులో 60, బీ బ్లాకులో 52, సీ బ్లాకులో 28 షాపులకు విజయవాడ ప్రాంతీయ సంయుక్త మార్కెటింగ్ సంచాలకులు ఆధ్వర్యంలో ఉదయం 11గంటలకు మార్కెట్ కమిటీ కార్యాలయంలో వేలం జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

నెల్లూరురూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నెల్లూరురూరల్లోని ధనలక్ష్మీపురంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు కుంచాల విజయభాస్కర్ తెలిపారు.


బీవీ పాళెం ఓడ రేవు వద్ద పడవ షికారుకు వెళుతున్న సందర్శకులు

పర్యాటక హబ్‌గా పులికాట్



తడ, దొరవారిసత్రంలలో ఉన్న పర్యాటకశాఖ రిసార్ట్‌లను అందుబాటులోకి తెస్తాం. కొల్లేరుతో పాటు పులికాట్ సరస్సును పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతాం. పర్యావరణ పరిరక్షణతో పాటు మత్స్యకారుల సంక్షేమమూ మాకు ముఖ్యం. డిప్యూటీ సీఎం, అటవీ శాఖా మంత్రి అయిన పవన్ కల్యాణ్ దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లి ఆంక్షల సడలింపునకు కృషి చేస్తాం.

-పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్

రిసార్ట్‌లు ప్రైవేటుకు వద్దు



పులికాట్ సరస్సు పూడికతీతకు అనుమతులు వచ్చాయి. త్వరలోనే ఆ పనులు మొదలవుతాయి. ఇక్కడి రిసార్ట్‌లను పూర్తిగా ప్రైవేట్ పరం చేయకుండా ప్రభుత్వ భాగస్వామ్యంతో నడిచేలా మంత్రి చర్యలు తీసుకోవాలి.

- సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

యువతకు ఉపాధి



సూళ్లూరుపేట, నేలపట్టు, బీవీపాలెం ప్రాంతాలను టూరిజం హబ్‌గా చేస్తే యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయి. ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. ఇది మత్స్యకారులకూ ప్రయోజనకరం అవుతుంది. ప్రకృతి సౌందర్యంగా పర్యాటకులను ఆకర్షిస్తున్న పులికాట్ సరస్సు అభివృద్ధికి అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకొంటుంది.

- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్


సూళ్లూరుపేట జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఫ్లెమింగో ఫెస్టివల్ బెలూన్ ఎగురవేస్తున్న మంత్రి కందుల దుర్గేష్ ఎమ్మెల్యే విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు


ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభం సందర్భంగా సూళ్లూరుపేటలో శోభాయాత్ర

రెక్కలు విప్పుకున్న ఉత్సవం

ఘనంగా మొదలైన ఫ్లెమింగో ఫెస్టివల్

సూళ్లూరుపేట/ తడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగ శనివారం ఘనంగా మొదలైంది. మూడు రోజుల పాటు జరిగే ఫ్లెమింగో ఫెస్టివల్‌ను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానంలో ఫ్లెమింగో బెలూన్ ఎగురవేసి ప్రారంభించారు. ఉదయం సూళ్లూరుపేట హోలిక్రాస్ సర్కిల్ నుంచి ప్రభుత్వ కళాశాల మైదానం వరకు శోభాయాత్ర జరిగింది.బుట్టబొమ్మలు, మంగళ వాయిద్యాలు, కేరళ బ్యాండ్‌మేళం, కోలాట నృత్యాలతో ఈ శోభాయాత్ర కన్నులపండువగా సాగింది. పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్, డీఎఫ్‌వో హారిక శోభాయాత్రలో ముందు నడిచారు. అనంతరం మైదానంలో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్‌ను మంత్రి ప్రారంభించి, అక్కడ ఏర్పాటు చేసిన నమూనాలను తిలకించారు. క్రీడా ప్రాంగణంలో మంత్రి క్రీడాకారులతో కాసేపు ఆడి అలరించారు. శ్రీసిటీ, షార్ స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకున్నాయి. చిన్న బొమ్మ విమానాలను మైదానంలో ఎగురవేశారు.ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభ సమావేశంలో మంత్రి కందుల దుర్గేశ్ ప్రసంగించారు. టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్తలు కొండేపాటి గంగాప్రసాద్,తానంకి నానాజీ, సూళ్లూరుపేట మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, ఆర్డీవో కిరణ్మయి, జనసేన నాయకుడు ఉయ్యాల ప్రవీణ్, బీజేపీ నాయకుడు ఆదినారాయణరెడ్డి తదితరులు శోభాయాత్రలోనూ, ఇతరకార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు.

పులికాట్‌లో..

పులికాట్ సరస్సులోని పక్షులను వీక్షించడానికి సందర్శకులు శ్రీహరికోట రోడ్డులో బారులు తీరారు. అటకానితిప్పలోని విజ్ఞానకేంద్రానికి, పులికాట్ సరస్సు వ్యూపాయింట్‌ల వద్దకు పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. జర్మనీ దేశస్థులు కొందరు ఫ్లెమింగో ఫెస్టివల్‌కు రావడం విశేషం.

నేలపట్టులో..

నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో తొలిరోజు పర్యాటకుల సందడి ఎక్కువగా కన్పించింది. బైనాక్యులర్స్ ద్వారా పక్షులను వీక్షిస్తూ జనం సందడి చేశారు. ఇక్కడి స్నేక్ షో అందరిని ఆకట్టుకుంది.

ఉత్సాహంగా పడవ షికారు..

భీములవారిపాళెం పడవలరేవులో పర్యాటకుల సందడి పెద్దఎత్తున కనిపించింది. పర్యాటకులు పడవల్లో షికారు చేస్తూ సందడి చేశారు.

ఐదేళ్ల తర్వాత.. పండుగ ఇలాగేనా?

ఈ సారి పక్షుల పండుగకు తగినంత ప్రచారం కొరవడటంతో ప్రారంభోత్సవంలో సందర్శకులు పలుచగా కనిపించారు. దీనికి తోడు పాఠశాలలకు సెలవులు కావడంతో విద్యార్థులు కూడా పెద్దగా రాలేదు. తిరుపతి, నెల్లూరు జిల్లాల్లోని ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవడంలోనూ లోపం కనిపించింది. స్థానిక నాయకులు కూడా పెద్దగా హాజరు కాలేదు. ఐదేళ్ల తర్వాత తిరిగి మొదలవుతున్న ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభోత్సవం ఆశించినంత ఘనంగా అయితే కనిపించలేదు. కేవలం ఒక మంత్రి, ఒక ఎమ్మెల్యేతోనే పక్షుల పండుగ మొదలు కావడం విశేషం. జిల్లాలోని ఇతర ప్రజాప్రతినిధులు ఎవరూ ప్రారంభ కార్యక్రమానికి హాజరు కాలేదు. ప్రతిష్ఠాత్మకమైన ఒక రాష్ట్ర పండుగ జరుగవలసినంత సంబరంగా అయితే తొలిరోజు కార్యక్రమాలు మొదలు కాలేదు.


శనివారం రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమం


షార్ వారిచే ఏర్పాటు చేసిన స్టాల్


శెట్టిపల్లిలో మొక్క నాటుడుతున్న అధికారులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

● స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌లో కలెక్టర్ పిలుపు

తిరుపతి అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం 'స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కార్యాలయాలు, ఇతర ప్రాంతాల్లో పరిసరాలను శుభ్రం చేశారు. తిరుపతిలోని ప్రకాశం పార్కులో చెత్తను తొలగించడంతో పాటు మానవ హారం ఏర్పాటు చేశారు. శెట్టిపల్లిలో చెత్తకుప్పలను తొలగించారు. రోడ్డు పక్కన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. ఇళ్లతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ప్రతి నెలా మూడవ శనివారం ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. క్రమం తప్పకుండా ఇంటింటి చెత్తసేకరణ, చెత్తకుప్పలు లేకుండా చేయడమే ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. చెత్తను తొలగించడమే కాకుండా స్వచ్ఛ గాలికోసం మొక్కలు నాటాలని కమిషనర్ మౌర్య కోరారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్‌కు అందరూ సహకరించాలని శాప్ ఛైర్మన్ రవి నాయుడు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, కార్పొరేటర్లు ఆర్సీ మునికృష్ణ, అనిత, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో కందులవారిపల్లె

ఉప సర్పంచి దుర్మరణం

● శేషాపురం సమీపాన శనివారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఘటన


ఏనుగుల దాడిలో మృతిచెందిన రాకేష్ చౌదరి

చంద్రగిరి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పంటలను తొక్కేస్తున్న ఏనుగులను తరిమేందుకు వెళ్లిన యువకులపై అవి తిరగబడ్డాయి. వీటి దాడిలో చంద్రగిరి మండలం కందులవారిపల్లె ఉప సర్పంచి రాకేష్ చౌదరి దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటన శనివారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కుప్పం ప్రాంతం నుంచి కొన్ని ఏనుగులు శేషాచల అడవుల్లోకి చేరాయి. శేషాపురం సమీపాన అడవుల్లోకి చేరిన సుమారు 12 ఏనుగులు కళ్యాణి డ్యామ్‌లో నీళ్లు తాగేందుకు తరచూ వస్తుంటాయి. ఈ క్రమంలో పంటలను తొక్కేస్తున్నాయి. వేసిందే కొద్దిపాటి పంటలు కావడంతో... ఏనుగుల బారి నుంచి వాటిని రక్షించుకోవడానికి కొంతమంది యువకులు సిద్ధమయ్యారు. మరోవైపు కొందరు గ్రామస్తులతో కలిసి అటవీశాఖ సిబ్బంది కూడా రాత్రి వేళ ఏనుగులను తరిమే పనిలో ఉన్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి శేషాపురం, మామిడిమాను కండ్రిగ తదితర ప్రాంతాలకు చెందిన పది మంది వరకు యువకులు ఏనుగులను తరిమేందుకు వెళ్లారు. శేషాపురం సమీప పొలాల్లో వీటిని తరిమారు. ఆ సమయంలో గున్న ఏనుగు ఒకటి వెనుకబడినట్లు యువకుల్లో ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఈ యువకులను గమనించిన ఆ గున్న ఏనుగు అరవడంతో, అడవిలోకి వెళుతున్న ఏనుగుల గుంపు వెనక్కి వచ్చాయి. వీటిని చూసి యువకులు పరుగుతీశారు. చాలామంది చెట్లు ఎక్కేశారు. అయితే, కాలికి బూట్లు వేసుకుని ఉన్న మామిడిమాను కండ్రిగకు చెందిన ఐ టీడీపీ మండల అధ్యక్షుడు, కందులవారిపల్లె ఉప సర్పంచి అయిన రాకేష్ చౌదరి చెట్టు ఎక్కలేకపోయారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న ఏనుగులు అతడిపై దాడి చేసి తొక్కేయడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటనకు సమీపంలోనే అటవీశాఖ సిబ్బంది కూడా ఉన్నారు. ఈ విషయం తెలిసి పరిసర గ్రామాల ప్రజలు 12 గంటలపైన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మరోవైపు పోలీసులూ అక్కడికి వచ్చి వివరాలు తెలుసుకున్నారు. కాగా, మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనతో శేషాపురం సమీప గ్రామాల్లో విషాదం.. భయాందోళన నెలకొన్నాయి.

ఆత్మహత్య చేసుకున్న రైతులెందరు?

● మూడేళ్ల వివరాలు సేకరిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గత మూడేళ్లలో జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న రైతుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. వారంలోపు నివేదిక పంపాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఆ పనిలో తలమునకలై ఉన్నారు. జిల్లాలో 2021-22లో 56 మంది, 2022-23లో 21 మంది, 2023-24లో 18 మంది రైతులు అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం వారి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. వారి కుటుంబాలకు ఎంతో కొంత మేలు చేయాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం వివరాలు సేకరిస్తోంది. జిల్లాలో ఎక్కువగా చంద్రగిరి, తిరుపతి రూరల్, సత్యవేడు, నాయుడుపేట, గూడూరు ప్రాంతాల్లో రైతుల ఆత్మహత్యలు ఉన్నట్లు సమాచారం. సర్కిళ్లు, స్టేషన్ల వారీగా సంబంధిత సీఐలు, ఎస్ఐల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఎక్కడెక్కడ ఎంత మంది ఆత్మహత్య చేసుకున్నారు? వాటికి గల కారణాలేమిటి? ఎంత అప్పు ఉంది? బ్యాంకుల ద్వారా ఎంత రుణం తీసుకున్నారనే వివరాలు సమగ్రంగా క్రోడీకరిస్తున్నారు.

'అన్న'కు ఆత్మీయ నివాళి



టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా తెలుగు తమ్ముళ్లు ఘన నివాళులర్పించారు. అన్నదానం చేశారు. మహిళా వర్సిటీతో పాటు పలు చోట్ల వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.

తిరుపతిలో ఎన్టీఆర్ విగ్రహానికి హారతి ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఆ పార్టీ పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, శాప్ చైర్మన్ రవినాయుడు తదితరులు



మహాకుంభమేళాలో వైభవంగా శ్రీనివాసకల్యాణం

మహాకుంభమేళా సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఏర్పాటు చేసిన శ్రీవారి నమూనా ఆలయ ప్రాంగణంలో శనివారం ఉదయం శ్రీనివాసకల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహించారు. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు ఆధ్వర్యంలో అర్చక బృందం ఈకార్యక్రమాలు నిర్వహించింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో దువ్వాడ, మాధురి




ఏక్తా కపూర్ - దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి

బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమలలో వీడియో షూట్‌లో వివాదాస్పదం అయిన దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దీనిపై అప్పట్లో టీటీడీ కేసు కూడా పెట్టిన విషయం తెలిసిందే. ఈసారి ఎటువంటి వీడియో హంగామా లేకుండానే వారు శ్రీవారి దర్శనం చేసుకున్నారు. అలాగే శనివారం రాజస్థాన్ గవర్నర్ హరిబౌ కిషన్‌రావు బగాడే, తెలంగాణ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ప్రముఖ సినీ నిర్మాత ఏక్తా కపూర్, టీటీడీ మాజీ జేఈవో శ్రీనివాసరాజు కూడా స్వామి దర్శనం చేసుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

హుండీ ఆదాయం రూ.3.15 కోట్లు



తిరుమల వేంకటేశ్వరస్వామికి గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించగా రూ.3.15 కోట్లు ఆదాయం లభించింది.

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 61,142

తలనీలాలు సమర్పించినవారు: 19,736



పక్షులు.. పడవలు.. పర్యాటకులు..

అంబరాన్నంటిన పక్షుల పండుగ

ఏటా విహంగ ప్రేమికుల మనసు దోచుకుంటున్న ఫ్లెమింగో ఫెస్టివల్ సుమారు పాతికేళ్ల క్రితమే శ్రీకారం చుట్టుకొంది. దేశంలో మరెక్కడా లేనివిధంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవానికి బీజం పడిన నాటి విశేషాలను ఒకసారి మననం చేసుకుందాం.

- దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

విహంగ వేడుక.. ఇంతింతై..

2000లో నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్ పనిచేశారు. ఈ సయంలో దొరవారిసత్రం మండలం కలగుంట రైల్వే వంతెన ప్రాంతంలో వేల సంఖ్యలో చక్కర్లు కొడుతున్న పక్షుల సమూహాలు ఆయనను ఆకర్షించాయి. అవి నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం విడిదిలోని విదేశీ విహంగాలని తెలుసుకున్నారు. వీటిపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. నాటి శాసన సభ్యుడు పరసా వెంకటరత్నయ్య, టీడీపీ నేత వేనాటి రామచంద్రారెడ్డిలతో తన ఆలోచనలను పంచుకున్నారు. పక్షులతో విడదీయరాని బంధమున్న ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు వచ్చేలా పండగ నిర్వహించాలని సంకల్పించారు. ఫలితంగా నేలపట్టులో 2000 జనవరిలో పక్షుల పండుగ ప్రారంభమైంది. 2001లో సూళ్లూరుపేట వేదికగా నేలపట్టు, పులికాట్ సరస్సుల్లో ఫ్లెమింగో పేరిట జిల్లా స్థాయిలో పండుగ నిర్వహించారు. 2002లో అదే ఉత్సాహం కొనసాగించారు. వేడుక పుణ్యమాని నేలపట్టు ప్రాంతంలో పలు అభివృద్ధి పనులు శ్రీకారం చుట్టుకున్నాయి. 2003 ఫెస్టివల్ సమయానికి నేలపట్టులో రోడ్లు, టూరిజం భవనాలు, దొరవారిసత్రంలో టూరిజం హోటల్, తడలో టూరిజం హోటల్‌ను నెలకొల్పారు.

2016లో స్టేట్ ఫెస్టివల్‌గా..

2004, 2009లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఫ్లెమింగో ఫెస్టివల్‌ను కొనసాగించింది. 2009లో టీడీపీ ఎమ్మెల్యేగా మళ్లీ గెలిచిన పరసా వెంకటరత్నయ్య నాటి ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డితో కలిసి చొరవ తీసుకుని పక్షుల పండుగ కొనసాగేలా చూశారు. 2014లో టీడీపీ అధికారంలోకి రావడంతో చంద్రబాబు 2016లో ఈవేడుకను ఏపీ టూరిజం క్యాలెండర్‌లో చేర్చారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. అయితే విశేష జనాదరణ కలిగిన ఫ్లెమింగో ఫెస్టివల్‌ను గత వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. 2019లో అధికారంలోకి వచ్చాక 2020లో మొక్కుబడిగా జరిపింది. తర్వాత నాలుగేళ్లు నిర్వహించలేదు. టీడీపీ అధికారంలోకి రావడంతో పక్షుల పండుగకు ఇప్పుడు మళ్లీ ప్రాణం వచ్చింది.

హుషారుగా.. పడవ షికారు

పెళ్లకూరు/తడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తడ మండలం భీములవారిపాళెం వద్ద పడవ షికారుకు సందర్శకులు ఉత్సాహం చూపారు. పెద్ద సంఖ్యలో పులికాట్ సరస్సులో విహరించారు. పడవషికారులో లైఫ్ జాకెట్లతోపాటు 10 మందికి మించి వెళ్లనీవ్వకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. పులికాట్ సరస్సు ఒడ్డున కొందరు నీళ్లల్లో ఆడుతూ సందడి చేశారు. అక్కడి వేదిక వద్ద స్థానిక కళాకారులు నృత్య ప్రదర్శన పాటలతో అలరించారు. అక్కడే విధుల్లో ఉన్న పెళ్లకూరు ఎంపీడీవో ప్రమీలారాణి బుల్లెట్ బైక్ పాటకు డ్యాన్స్ వేసి ఉత్సాహపరిచారు.



ఫ్లెమింగో ఫెస్టివల్ వేదికపై పర్యాటక బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు

మొదటిసారి పడవ ప్రయాణం



మొదటిసారి పడవ షికారుకు వచ్చా. నీళ్లల్లో పడవ వెళ్తుంటే ఆనందంతో కేరింతలు కొట్టాలనిపించింది.

- విరోనిక, 6వ తరగతి, నాయుడుపేట

అహా.. వలస పక్షుల విన్యాసాలు

పులికాట్ సరస్సులో ఫ్లెమింగోలను చూడాలని వచ్చాం. వీటి విన్యాసాలను చూస్తుంటే అబ్బురపరుస్తున్నాయి. పిల్లలు వాటిని చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు.

- పూజిత, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, బుచ్చినాయుడుకండ్రిగ



నేలపట్టు కిట.. కిట!





దొరవారిసత్రం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగో ఫెస్టివల్ మొదటి రోజైన శనివారం నేలపట్టు పక్షుల కేంద్రానికి సందర్శకులు క్యూకట్టారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు, చిత్తూరు, తమిళనాడు, ప్రకాశం జిల్లాల నుంచీ భారీగా తరలి వచ్చారు. కుటుంబ సమేతంగా.. చంటి బిడ్డలతో, దివ్యాంగులు, వృద్ధులు సైతం పక్షుల వీక్షణకు విచ్చేశారు. మంచి నీటి చెరువుల్లో విడిదిలో ఉన్న విహంగాలను వీక్షించారు. ఓ వైపు పక్షుల కేంద్రంలో పక్షులు తమ సంతతిని వృద్ధి చేసుకొనే పనిలో ఇప్పటికే పిల్లలను పొదిగాయి. వాటి చప్పుళ్లతో పాటు సందర్శకుల రాకతో నేలపట్టు సందడిగా మారింది. చెరువు కట్టలపై జనం కిక్కిరిశారు. వీరిని అదుపు చేయడం వలంటీర్లకు పెద్ద పనిగా మారింది. ఇక, బైనాక్యూలర్లు సరిపడా లేకపోవడంపై సందర్శకులు అసంతృప్తి చెందారు. ఎక్కువ మంది సందర్శకులు తమతో తెచ్చుకొన్న కెమెరాలతో పాటు సెల్‌ఫోన్లలో పక్షుల ఫొటోలు తీస్తూ కనిపించారు. తామూ ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు. ఇక, ఈసీ కేంద్రంలో పక్షుల చిత్రాలు, శాండ్ ఆర్ట్, ఫిల్మ్ షో, పెలికాన్ అతిథి గృహాల వద్ద స్థానిక విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. మరోవైపు ఆకతాయిలు, చిల్లర దొంగల ఆటకట్టించేందుకు పోలీసులు పక్షుల కేంద్రంలోని పలు చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ఉరితాడులా వన్యప్రాణి చట్టాలు

ఫ్లెమింగో సభలో మాజీ ఎమ్మెల్సీ వాకాటి

సూళ్లూరుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పులికాట్ సరస్సు పై ఈ ప్రాంతంలో దాదాపు 10 వేల మందికి పైగా మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారని, అంతేకాకుండా పులికాట్ సమీపంలో ఇరకం, వేనాడు దీవులు, కొరిడి-పేర్నాడు తీర ప్రాంత గ్రామాలు ఉన్నాయని గ్రామాల్లో అభివృద్ధి చేయాలన్న, రోడ్ల నిర్మాణాలు చేపట్టాలన్న వన్యప్రాణి చట్టాలు ఉరితాడులా మారాయని మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న షార్ కేంద్రానికి మాత్రం చట్టాలు వర్తించవా? సరస్సు పై ఆధారపడి జీవనం సాగించే వారికి మాత్రం చట్టాలు వర్తిస్తాయా? ప్రభుత్వం దీని పై చొరవ తీసుకొని ఈ ప్రాంతాల అభివృద్ధికి అడ్డంకులు తొలిగేలా కొన్ని సడలింపులు తీసుకోవాలన్నారు. మాజీ మంత్రి పరసా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో పక్షుల పండుగ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గత ప్రభుత్వం పక్షుల పండుగ నిలిపివేసింది

● వైసీపీ నేత సంచలన వ్యాఖ్య

సూళ్లూరుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):గత ప్రభుత్వం 2020 తరువాత పక్షుల పండుగ నిలిపివేసిందని వైసీపీకి చెందిన సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభోత్సవ సభలో చేసిన వ్యాఖ్యలు అందరినీ ఆశ్చర్యపరిచాయి. ప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా ఆర్అండ్‌బీ రోడ్లు దారుణంగా దెబ్బతిని గుంతలమయమైపోయాయని అన్నారు.ప్రస్తుత ప్రభుత్వం ఆ రోడ్లకు మరమ్మతులు చేస్తోందన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు సన్నిహిత కుటుంబంగా పేరున్న దబ్బల రాజారెడ్డి కుమారుడు వారి గత ప్రభుత్వంలోని లోపాలను ఎత్తిచూపుతూ మాట్లాడడంపై పలువురు చర్చించుకున్నారు.

కోస్టల్ కారిడార్‌లో పర్యాటక అభివృద్ధి చేస్తాం

● నేలపట్టులో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్



నేలపట్టులో బైనాక్యూలర్ ద్వారా పక్షులను వీక్షిస్తున్న రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

దొరవారిసత్రం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 970 కి.మీ మేర ఉన్న కోస్టల్ కారిడార్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. విదేశీ విహంగాలు విడిది చేసే నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని శనివారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈసీ కేంద్రంలోని పక్షుల జీవన చిత్రాలను తిలకించారు. చెరువు కట్టపై నుంచి బైనాక్యూలర్ ద్వారా పక్షులను వీక్షించారు. నేలపట్టు ప్రకృతి సిద్ధమైన, అరుదైన కేంద్రమని పేర్కొన్నారు. నేలపట్టు ప్రాముఖ్యత, విడిది చేసే పక్షుల జీవన శైలి గురించి డీఎఫ్‌వో హారిక వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. నేలపట్టును టూరిజంపరంగా మరింత అభివృద్ధి చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడంతోనే ఇంతటి జనాదరణ ఉన్న ఫ్లెమింగో ఫెస్టివల్‌ను నిర్వహించలేదని విమర్శించారు. కూటమి అధికారంలోకి రాగానే పక్షుల పండుగ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంత్రి వెంట గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఎఫ్‌ఆర్‌వో సౌజన్య, తహసీల్దారు శైలా కుమారి తదితరులున్నారు.

పర్యావరణం.. పరిశ్రమలపై శ్రీసిటీలో సదస్సులు

శ్రీసిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగో ఫెస్టివల్‌లో భాగంగా శనివారం 'పర్యావరణం.. పరిశ్రమలు'పై శ్రీసిటీలో సదస్సు నిర్వహించారు. శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో జరిగిన కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) సదస్సులో పర్యావరణ నిర్వహణ, సామాజిక స్పృహ అంశాలను చర్చించారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌లో శ్రీసిటీ పాల్గొనడం సుస్థిరత, పర్యావరణ పరిరక్షణ పట్ల దాని నిబద్ధతకు నిదర్శనమని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. జీవ వైవిధ్యాన్ని రక్షించడానికి, ప్రకృతి సమతుల్యతను పెంపొందించడానికి పరిశ్రమలు, స్థానికుల సహకారం అవసరమన్నారు. పర్యావరణ పరిరక్షణతో వ్యాపార లక్ష్యాలను సమతుల్యం చేయడానికి సీఎస్ఆర్ కార్యక్రమాలు చేపట్టాలని అటవీశాఖ కన్జర్వేటర్ సి.సెల్వం కోరారు. పులికాట్ సరస్సు, వలస పక్షుల నివాసాల రక్షణకు కార్పొరేట్ భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తూ బీఎన్‌హెచ్ఎస్ డైరెక్టర్ కిషోర్ రితే ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. ఇక్కడ హరిత పరిశ్రమలను మాత్రమే ఏర్పాటు చేస్తున్నామని శ్రీసిటీ చైర్మన్ సి.శ్రీనిరాజు తెలిపారు. అభివృద్ధితో పాటు ప్రకృతి పరిరక్షణపైనా ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. పులికాట్ సరస్సును కాపాడుకోవడానికి సమష్టి, నిరంతర కృషి అవసరమని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు. దీనికి ఫ్లెమింగో ఫెస్టివల్ ఎంతో ఉపకరిస్తుందన్నారు. శ్రీసిటీ పరిశ్రమల సీఎస్ఆర్ ప్రయత్నాలను అభినందిస్తూ ఐఎంవోపీ, కెల్లాగ్స్, పార్సన్ ప్యాకేజింగ్స్‌ఇసుజు మోటార్స్, టీహెచ్‌కే, కోల్గేట్ పామోలివ్‌డైకి అల్యూమినియం, బెర్గెన్‌పైప్స్, డానియేలీ, హామిల్టన్, ఆస్ట్రోటెక్, పియోలెక్స్, ఎస్ఎంసీసీ, వెస్ట్ ఫార్మా పరిశ్రమల అధికారులకు కలెక్టర్ జ్ఞాపికలను అందజేశారు. క్రియా విశ్వ విద్యాలయంలో జీవ వైవిధ్యం, చిత్తడి నేలల సంరక్షణపై రెండు రోజుల సమావేశం కూడా బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ(బీఎన్‌హెచ్ఎస్)కి చెందిన డాక్టర్ సత్యసెల్వం అధ్యక్షతన శనివారం ప్రారంభమైంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్), పక్షి శాస్త్ర నిపుణుల భాగస్వామ్యంతో జరిగిన ఈ సమావేశంలో వృక్ష, జంతు వైవిధ్యం, మత్స్య, పర్యాటక ప్రయోజనాలు, హైడ్రోలాజికల్ డైనమిక్స్, వాతావరణ మార్పు ప్రభావాలు, కాలుష్యం తగ్గించడం తదితర ప్రయత్నాల్లో సమాజ భాగస్వామ్యంపై చర్చించారు.



సీఎస్ఆర్ బహుమతి అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

నేటి కార్యక్రమాలిలా..

తడ, ఆంధ్రజ్యోతి: ఆదివారం జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో సినీ సంగీత దర్శకుడు రఘు కుంచె, గాయని మంగ్లి పాల్గొననుండగా, బిగ్‌బాస్ ఫేమ్ అమరెడ్డి, రవి యాంకర్లుగా వ్యవహరించనున్నారు.

నేడు ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్సు లాబొరేటరీ ప్రారంభం



తిరుపతి(నేరవిభాగం), జనవరి 18(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రూ.3.6 కోట్లతో నిర్మించిన ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్సు లాబొరేటరీని ఆదివారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ ఏర్పాట్లపై అదనపు ఎస్పీ వెంకట్రావు, జీడీ ఈశ్వరయ్య, ఎంటీవో రాజశేఖర్, ఫోరెన్సిక్ సిబ్బందితో ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ సమీక్షించారు. ఈ ఫోరెన్సిక్ లేబొరేటరీ జిల్లా భద్రతా రంగానికి, న్యాయ వ్యవస్థకు ఉపయోగపడుతుందని తెలిపారు.

జవహర్ నవోదయ పరీక్షకు 1,519 మంది హాజరు

తిరుపతి(విద్య), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ స్కూళ్లలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగిందని డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. తిరుపతి నగరంలోని రెండు కేంద్రాలతో పాటు గూడూరు, కోట, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి, పుత్తూరు, సత్యవేడు, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో మొత్తం 10 కేంద్రాల్లో పరీక్ష జరిగిందని, 2,313 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, 1,519 మంది హాజరుకాగా 794 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్‌కు అదనపు బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌లో భాగంగా సందర్శకుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులను ఏర్పాటు చేశారు. సూళ్లూరుపేట కేంద్రంగా నాయుడుపేట వయా నేలపట్టు, భీమునివారిపాలెం, షార్ వయా అత్తికానితిప్పలకు ఒక్కోటి చొప్పున, నెల్లూరుకు 3 బస్సులను ఏర్పాటు చేశారు. ఇక తిరుపతి-సూళ్లూరుపేట మధ్య రెగ్యులర్‌గా తొమ్మిది తిరుగుతుండడంతో అదనపు బస్సులు అవసరపడలేదు. సందర్శకులు సద్వినియోగం చేసుకోవాలని ప్రజారవాణాధికారి జి.నరసింహులు కోరారు.

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి



బొంగరాల పోటీల్లో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఏపిరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనంలో కోడిం బిళ్లా, బొంగరాలు, గోలీలాట తదితర క్రీడలు గ్రామీణ క్రీడలకు చిహ్నంగా ఉండేవన్నారు. ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ క్రీడలు కనుమరుగవుతూ వస్తున్నాయన్నారు. అంతరించిపోతున్న గ్రామీణ క్రీడలను గుర్తుకు తెస్తూ ప్రగతి సేవాసంస్థ క్రీడాపోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, సురేష్‌రెడ్డి, పూర్ణచంద్రరావు, పేటేటి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, మునిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న జడ్జి అనూష

వెంకటగిరి టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని వెంకటగిరి సివిల్ జడ్జి అనూష అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలను పెంచడం ద్వారా వాతావరణ సమతుల్యత ఏర్పడి సకాలంలో వర్షాలు పడుతాయన్నారు. ప్రస్తుతం కాలుష్యం విపరీతంగా పెరిగిపోయి పర్యావరణం దెబ్బతింటోందని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి



ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గూడూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాదిగలకు న్యాయం జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి సిసింద్రి అన్నారు. శనివారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ చింతా మోహన్ వ్యతిరేకించడం తగదన్నారు. కాంగ్రెస్ పార్టీ యువనేత రాహుల్‌గాంధీ కూడా ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తెలంగాణ రాష్ట్రంలో మాట్లాడిన విషయాన్ని చింతా మోహన్ గుర్తించాలన్నారు. కార్యక్రమంలో శేషు, నారాయణ, భాస్కర్, వెంకటేశ్వర్లు, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ టిప్పర్ల స్వాధీనం

కోట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చంద్రశేఖరపురం నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్షలు

గూడూరు అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తహసీల్దారు చంద్రశేఖర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం స్వీకరణ



టీడీపీ శాశ్వత సభ్యుతం తీసుకొంటున్న రాజేశ్వరరావు

వెంకటగిరి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు శనివారం రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం స్వీకరించారు. ఆయనను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగోటి నాగేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, జిల్లా ఎస్టీ సెల్ నాయకుడు చలపతి అభినందించారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలిసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ జరిపి ఆలయ ఆవరణలో ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నేత్రదానం

గూడూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాలాయనంద పురానికి చెందిన కలగట్ల జయమ్మ అనే వృద్ధులు శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబసభ్యుల సహకారంతో జయమ్మ నేత్రాలను సునీత సేవాసంస్థ సేకరించి నెల్లూరుకు చెందిన మోడరన్ కంటి ఆస్పత్రికి అందజేసినట్లు సంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు తెలిపారు.



చిన్నపాటి విమానాన్ని ఎగురవేస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు



షార్ స్టాల్స్‌లో రాకెట్, ఉపగ్రహ నమూనాలు







పర్యాటకులతో కిటకిటలాడుతున్న పడవలరేవు - నేలపట్టులో విద్యార్థులు

పులకించిన పులికాట్ తీరం

సూళ్లూరుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగతో పులికాట్ తీరం పులకించింది. శనివారం ఉదయం పండుగ ప్రారంభోత్సవం సమయానికి సందర్శకులు తక్కువగా ఉన్నా మధ్యాహ్నం 4 గంటల నుంచి పులికాట్ తీరం పర్యాటకులతో కళకళలాడింది. పులికాట్ తీరం వెంబడి జనం పక్షులను తిలకిస్తూ సెల్ఫీలు తీసుకొంటూ సందడి చేశారు. అట్టకాని తిప్ప వద్ద ఉన్న పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో ఫ్లెమింగోలతో పాటు, పులికాట్ అడవుల్లో లభించే మొక్కలు, జంతువులను ప్రదర్శనశాలలో పెట్టి సందర్శకులకు వివరాలను తెలియజేసే విధంగా ఏర్పాట్లు చేశారు. అట్టకాని తిప్ప వద్దనున్న పర్యావరణ విజ్ఞాన కేంద్రం, పులికాట్ సరస్సును జర్మనీ దేశస్తులు సందర్శించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కూడా సాయంత్రం అట్టకానితిప్ప వద్ద ఏర్పాట్లను పరిశీలించి అక్కడున్న పర్యాటకులతో కాసేపు సరదాగా మాట్లాడారు.

ఆకట్టుకుంటున్న షార్, వన్యప్రాణి స్టాల్స్

పక్షుల పండుగ పురస్కరించుకొని సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానంలో షార్, వన్యప్రాణి విభాగం ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. షార్ ఆధ్వర్యంలో న్యూ జనరేషన్ లాంచ్ వెహికల్, మానవ సహిత ప్రయోగానికి పంపే వ్యోమనౌక, చంద్రయాన్-3 ఉపగ్రహం, షార్ నుంచి ప్రయోగించిన వాహక నౌకలు, ఉపగ్రహాలను ఏర్పాటు చేశారు. వన్యప్రాణి విభాగం ఆధ్వర్యంలో పులికాట్, నేలపట్టులో పక్షులు చక్కర్లు కొట్టే నమూన, సర్పాలు, జింకలు, పులులు తదితర జంతువులు సంచరించే నమూనాలు సందర్శకులను ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి. అలాగే వ్యవసాయ శాఖ మందుల పిచికారీ చేసే డ్రోన్‌లను ప్రదర్శించి సందర్శకులకు సూచనలు ఇస్తోంది. అదేవిధంగా శ్రీసిటీలో పరిశ్రమల నమూనాలు, పశుసంవర్ధకశాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ఒంగోలు కోడె దూడలు ఆకర్షణగా నిలిచాయి.

ఉత్సాహంగా క్రీడలు

ఫ్లెమింగో ఫెస్టివల్‌లో భాగంగా సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన క్రీడల పోటీలు ఉత్సాహం, ఉల్లాసంగా సాగాయి. మంత్రి కందుల దుర్గేష్ క్రీడలను ప్రారంభించారు. కబడీ, వాలీబాల్, త్రోబాల్, ఖోఖో పోటీలు నిర్వహించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. అలాగే కోటపోలూరు హైస్కూల్ మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించారు.







వాలీబాల్ ఆడుతున్న కలెక్టర్ - కూరగాయలతో పక్షులు - ఇవి బొమ్మలే - ఇవి మాత్రం నిజమైనవే





పురాణాల నుంచి ఫ్లెమింగ్ ఫెస్టివల్‌కు పౌరాణిక పాత్రలు - కళాకారుల నృత్య ప్రదర్శన

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో సాయంత్రం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లటి గాలులతో పక్షుల పండుగకు వచ్చిన జనాలను ఉక్కిరిబిక్కిరి చేసింది. చిరుజల్లులు కురిశాయి. అయినా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న జనం తమ సీట్ల నుంచి కదలలేదు. సినీ నటుడు, మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి హాస్యవల్లరితో అలరించగా, ఆట పాటలతో కళాకారులు జనాలను మైమరిపించారు. శనివారం సాంస్కృతిక కార్యక్రమాలతో పక్షుల పండుగ పూర్తిగా విజయవంతమైంది.





గూడూరులో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, నాయుడుపేటలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకుల నివాళులు

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, చిల్లకూరు, డక్కిలి, వెంకటగిరి, పెళ్లకూరు, తడ, చిట్టమూరు, కోట, వాకాడు, బాలాయపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. గూడూరు పట్టణంలోని గమళ్లపాళెంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే సునీల్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళుల ర్పించారు. టీడీపీ కార్యాలయం వద్ద అన్నదానం, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా సొసైటీ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయుడుపేటలోని టీడీపీ కార్యాలయంలో సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సూళ్లూరుపేట రైల్వేగేటు వద్ద ఉన్న టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిల్లకూరు దర్గా వద్ద పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, బెల్లంకొండ రాజేంద్ర, డక్కిలిలో మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, వెంకటగిరి పట్టణంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగోటి నాగేశ్వరరావు, ఎంపీపీ తనూజరెడ్డి, శివారెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు శ్రీరామదాసు గంగాధర్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, అండమాన్ నికోబార్ దీవుల్లో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవనాయుడు, పెళ్లకూరు మండలం కొత్తూరులో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, తడ బజారుకూడలిలో టీడీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి, చిట్టమూరులో టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు, కోట పట్టణంలో టీడీపీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, విద్యానగర్‌లో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వాకా విజయభాస్కర్‌రెడ్డి, వాకాడులో తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి కుంచం దయాకర్, బాలాయపల్లిలో టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు.



సూళ్లూరుపేటలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే విజయశ్రీ నివాళి

పోలేరమ్మ హుండీ లెక్కింపు



నాయుడుపేట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ హుండీ ఆదాయాన్ని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసబాబు, ఈవో రవికృష్ణ సమక్షంలో శని వారం లెక్కించారు. రెండు నెలల 19 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.3,08,360 నగదు, 3.06 గ్రాముల బంగారం లభించింది.

టీడీపీ సీనియర్ నేత తోటయ్య మృతి



చిట్టమూరు, జనవరి18 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం పల్లంపర్తి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచు తీపలపూడి తోటయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు, నాయకులు సంతాపం తెలిపారు.

గొబ్బెమ్మల నిమజ్జనం



కోట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల స్వర్ణముఖినదిలో శనివారం గొబ్బెమ్మల నిమజ్జనం జరిగింది. గూడలి అరుంధతీయవాడతో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన గొబ్బెమ్మలను మహిళలు మేళతాళాలతో ఊరేగిస్తూ స్వర్ణముఖినదిలోని నీటిలో నిమజ్జనం చేశారు.

వైసీపీ నేత కుటుంబానికి పరామర్శ

నాయుడుపేట టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత తంబిరెడ్డి బలరామిరెడ్డి అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి టీటీడీ మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దనరెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, కౌన్సిలర్ నాగార్జున, దారా రవి, నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

డీఎస్పీ రమణకుమార్ బదిలీ

గూడూరు అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గూడూరు డీఎస్పీ రమణకుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఆగస్టు 11వ తేదీన గూడూరు డీఎస్పీగా వీవీ రమణకుమార్ బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం పలువురు డీఎస్పీలను బదిలీ చేసింది. ఇందులో భాగంగా గూడూరు డీఎస్పీగా పనిచేస్తున్న రమణకుమార్‌ను బదిలీ చేస్తూ విజయవాడలోని హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. ఆయన స్థానంలో గీతా కుమారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పొలంలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

చిట్టమూరు, జనవరి18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తాడిమేడు అనగొల్లపాళెం రోడ్డు సమీపంలో శనివారం ఉదయం ఆర్టీసీ బస్సు పొలంలోకి దూసుకెళ్లింది. కోట నుంచి సూళ్లూరుపేట వెళ్తున్న ఆర్టీసీ బస్సు స్టీరింగ్ దెబ్బతినడంతో అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఎవరికీ గాయాలు కాలేదు.

వెంకటగిరి క్రీడలకు పుట్టినిల్లు



బహుమతి అందుకుంటున్న నాయుడుపేట గేల్ ఫ్రెండ్స్ జట్టు

వెంకటగిరి టౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వెంకటగిరికి క్రీడలకు పుట్టినిల్లు అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జీఎస్ఆర్ సోషల్ సర్వీస్ ట్రస్టు గంగోడు నాగేశ్వరరావు అన్నారు. జీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీ పోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీల్లో ఐదు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. విజేతగా నిలిచిన గేల్ ఫ్రెండ్స్‌కు మెడల్, కప్ అందజేశారు. రన్నర్‌గా నిలిచిన వడమాలపేట, మూడవ స్థానంలో నిలిచిన వెంకటగిరి యువసేన టీమ్‌కు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులికల్లు రాజేశ్వరరావు, పునుగోటి విశ్వనాథం(మురగ), సీఐ ఏవీ రమణ, శ్రీనివాస రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో, తదితరులు

నాయుడుపేట టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మన ఇంటి వలే పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటురోగాలు ప్రబలకుండా చూడవచ్చని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా అన్నారు. నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయం నుంచి శనివారం ఎంపీడీవో సురేష్‌బాబు, మున్సిపల్, మండల పరిషత్, సచివాలయ సిబ్బందితో కలసి స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ ర్యాలీ నిర్వహించి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, కౌన్సిలర్ చంద్రారెడ్డి, పల్లమాల రామిరెడ్డి, కార్యదర్శి గోపాల్, శ్రీలక్ష్మి, శ్రీను, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు అర్బన్(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలో మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాల భారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం ఎమ్మెల్యే చీపురు చేతబట్టి వీధులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన

డక్కిలి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్వచ్ఛ భారత్.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసులుతో పాటు రెవెన్యూ సిబ్బంది కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, ఏఎస్‌వో వెంకటయ్య, సర్వేయర్ రాజగోపాల్, వీఆర్వోలు విజయ్ కుమార్, అమని, వీఆర్ఏలు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ ర్యాలీ

వెంకటగిరి టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కోటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్రా - స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా పట్టణ పురవీధులో స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.